BALA CHELIMI

BALA

SEP 2024

September



₹40

సెప్టెంబర్ - 2024

# బాల చెలిమి

పిల్లల వికాస పత్రిక

**BALA CHELIMI**

Telugu Children's Monthly Magazine

సంపుటి : 33 • సంచిక : 12



SEPTEMBER - 2024

Editor : **Er. VEDAKUMAR MANIKONDA**

A PUBLICATION OF **CHILDREN'S EDUCATIONAL ACADEMY,** HYDERABAD, TELANGANA



CENTRAL
SINCE 1947
BOOKS
Your trusted Academic Partner - Then, Now & Forever
DIAMOND JUBILEE
CELEBRATING 75 YEARS OF
KNOWLEDGE, TRUST & LEADERSHIP
12 lakhs + Customers
700+ Schools
15 Business Awards
Online Services
Digital Learning
Books and Stationery Supplies
Head Office : 6-3-553,C1, Quena Square, Erramanzil, Somajiguda, Hyderabad. Tel: 040-24098282
Regd. Office : Central Book Shop #5-9-186, Chapel Road, Abids, Hyderabad.
Warehouses: Plot No. P9/20, Sy. No. 81, IDA, Nacharam, Uppal Mandal, Medchal, Malkajgiri Dist.
Plot No: 1/5B, TSIIC Industrial Development Area, Nacharam, Medchal Dist., Hyderabad.
www.centralbooks.in


బాలచెలిమి
పిల్లల వికాస పత్రిక
# BALA CHELIMI
Telugu Children's Monthly Magazine

సంపుటి: Volume: 33 | సంచిక : Issue : 12 | హైదరాబాద్ Hyderabad | సెప్టెంబర్ September | పేజీలు Pages 52 | రూ. ₹. 40

**లోపలి పేజీల్లో.......**










| | | |
|---|---|---|
| మన టీచర్స్‌కి జేజేలు చెబుదాం!... | మణికొండ వేదకుమార్ | 5 |
| జాన్ లోగీ బైర్డ్ (సైంటిస్ట్) | బాలచెలిమి డెస్క్ | 6 |
| ఒకే కుటుంబం (కథ) | నారంశెట్టి ఉమామహేశ్వరరావు | 7 |
| రాధిక మీనన్ | షీరోస్–256 | 9 |
| గుండ్రం + నిటారు = అందమైన అక్షరం (అక్షరం) | వై. మల్లికార్జున రావు | 10 |
| ఎస్ఎస్ఎల్వి–డి3 రాకెట్ | సచిన్ కోత్వాల్. | 11 |
| కొత్త బడి (కథ) | డా. నీరజ అమరవాది | 12 |
| ఇద్దరు దోస్తులు (కథ) | లియో టాల్ స్టాయ్ | 13 |
| తెలివైన మాచె | డా. షేఖ్ అబ్దుల్ ఘనీ | 14 |
| నాలుగు రాళ్ళ ఆట (ఆట) | చిన్ననాటి ఆటలు – జ్ఞాపకాల మూటలు | 15 |
| అభినందనీయం (కథ) | అమ్మిన వెంకట అమ్మిరాజు | 16 |
| ఆచార్య దేవోభవ | సయ్యద్ షఫీ | 18 |
| ప్రకృతి నిర్మిత బొర్రా గుహలు | జుగాష్ విలి...... | 19 |
| ప్రయత్నిస్తే (నాటిక) | డా॥ కాసర్ల నరేశ్‌రావు | 20 |
| నిజమైన స్నేహితులు (కథ) | ఎం. రిత్విక | 23 |
| పాల బుగ్గలు–పూల మొగ్గలు (కవిత) | గద్వాల సోమన్న | 24 |
| నక్క–మాట్లాడే గుహ | పంచతంత్ర కథలు | 24 |
| పారా ఆర్చర్ శీతల్ దేవి (పారాలింపిక్స్) | బాలచెలిమి డెస్క్ | 25 |
| అద్దె అమ్మ (కార్టూన్) | చొక్కాపు వెంకటరమణ | 26 |
| ఆడపిల్ల – ఈడ పిల్ల (పాట) | గంగదేవు యాదయ్య | 28 |
| ఐదు పాట! బంగారు బొమ్మ (పాటలు) | | 28 |
| వింత టోపి (కథ) | అనిల్ బత్తుల | 29 |
| మట్టి చెట్టు (చెట్టు – చేమ) | కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి | 31 |

పులి పిల్లల మంచి మనసు (కథ) ............................ వడ్డేపల్లి వెంకటేష్............................ 32
దయ గల పులి (కథ)........................................ ఆర్ అపూర్వ ................................. 34
చంద్రశిలా శోభిత చంద్రవెల్లి గుళ్ళు (విహార స్థలాలు) ...... డా. ద్యావనపల్లి సత్యనారాయణ............. 35
చెలిమి క్లబ్................................................... బాలచెలిమి .................................... 36
కిలకిల నగవుల చిలుకలు (కథ) ............................. సమ్మెట ఉమాదేవి............................ 37
వీరగంధం తెచ్చినారము (దేశభక్తి గీతం)..................... కవిరాజు త్రిపురనేని రామస్వామి ............. 39
కలం చెలిమి ................................................. బాలచెలిమి ....................................39
యోగా నేచురోపతిక్ వైద్యం (ఆరోగ్యం – విజ్ఞానం)......... తెలంగాణ సారస్వత పరిషత్................. 40
వేమన పద్యాలు (శతకం)................................... ............................................. 40
నేర్చుకుందామా ............................................. ............................................. 41
పండ్లు (శాస్త్రీయ నామం) .................................. ఆరోగ్యం – విజ్ఞానం ........................ 42
గ్రేట్ గ్రే గుడ్లగూబ (పక్షి) .................................. సచిన్ కోత్వాల్ ............................... 43
ఆడుతూ పాడుకుందాం .................................... బాలచెలిమి .................................... 44
ఆకలి విలువ (కథ).. ....................................... షేక్ అబ్దుల్ హకీం జాని ..................... 45
అంతర్జాతీయ సంస్థలు, ప్రధాన కార్యాలయాలు (జి.కె.) .... సచిన్ కోత్వాల్ ............................... 47
సమాచారం ................................................... సచిన్ కోత్వాల్ ............................... 48
మరో మహాత్ముడు ఆంధ్రా గాంధి –
శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య గారు (వ్యక్తిత్వం)......... బాలచెలిమి డెస్క్.............................. 50

# చెలిమి లేఖలు

మా తెలుగు సార్ కందుకూరి భాస్కర్ ప్రోత్సాహంతో మా పాఠశాలలో బాల చెలిమి గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను నేను ఖాళీ సమయంలో చదువుతుంటాను. నాకు పంచతంత్ర కథలన్న, జంతువుల పాత్రలతో కూడిన కథలన్నా చాలా ఇష్టం. నేను రాసిన కథలు పత్రికలో ముద్రితం అయినపుడు నాకు ఎంతో సంతోషం కలిగేది. ఒక రోజు మా తెలుగు సార్ నాకు మణిపూసలు అనే ప్రక్రియను పరిచయం చేశాడు. నేను 'తెలుసుకో మిత్రమా' అనే మకుటంతో శత మణిపూసలు రాశాను. ఆ పుస్తకానికి వడిచర్ల సత్యం సార్, గరిపెల్లి అశోక్ సార్‌లు అభినందనలు తెలియజేశారు. పుస్తకాలను చదవడం ద్వారా జ్ఞానం వస్తుంది. ఏది మంచి, ఏది చెడు అనేది తెలుస్తుంది.

**గడ్డం అభిలాష్**

10 వతరగతి, జి.ప.ఉ.పా. నర్సింహుల పల్లి, పెద్దపల్లి జిల్లా.

నాకు కథలు రాయడం, చదవడం అంటే చాలా ఇష్టం. ప్రతి రోజూ ఒక కథ చదవడం ఒక అలవాటు. నేను రాసిన "రాము – సోము" కథ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ కథగా తెలంగాణ సారస్వత పరిషత్తు వారిచే ఎంపికైంది. బాల సారస్వతం – పిల్లల కథలు – 4లో ప్రచురితం కూడా అయింది. ఇంకను నేను రాసిన "ఫోను – చదువు" కథ చెకుముకి పత్రికలో ప్రచురితం అయింది. నాకు ఆటలు ఆడటం అంటే కూడా ఇష్టం.

**తల్లెల కీర్తి**

8వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
లక్ష్మీపూర్, ఆదిలాబాద్ జిల్లా.

OGS Junior's
Pic :
టి. స్వామి

బొమ్మలు:
కూరెళ్ల శ్రీనివాస్
m : 98495 43728




సంపాదకులు : మణికొండ వేదకుమార్

BALA CHELIMI
**"CHANDRAM"** 3-6-712/2, St.No.12, Himayatnagar,
Hyderabad - 500 029.
e-mail : edit.chelimi@gmail.com, www.balchelimi.com
Mob: 98480 44713

# మన టీచర్స్‌కి జేజేలు చెబుదాం!

జన్మనిచ్చేది తల్లిదండ్రులైతే జ్ఞానవంతులుగా, వ్యక్తులుగా, మనుషులుగా తీర్చిదిద్దే శిల్పకారులు టీచర్స్. పిల్లల భవిష్యత్ నిర్మాతలు టీచర్స్. రోజు మొత్తంలో పిల్లలు ఎక్కువ మెలకువ సమయాన్ని స్కూల్సులో, టీచర్స్ వద్దే గడుపుతారు. పిల్లల అభిరుచులు, అభిప్రాయాలు, అలవాట్లు, వారి శక్తి సామర్థ్యాలు, నైపుణ్యాలు టీచర్స్‌కి అర్థమయినంతగా మరెవరికీ అర్థం కావు. ఇవన్నీ పిల్లలందరిలో ఒకేలా ఉండవు. ఎవరి ప్రత్యేకతలు వారివే. ఈ ప్రత్యేకతలను గుర్తించి వారిలోని ప్రతిభకు మెరుగులు దిద్ది వారిని దృఢంగా నిలబెట్టేది టీచర్స్.



సాంకేతికాభివృద్ధి ఇంతగా లేని రోజుల్లో రవాణా, విద్యుత్, భవన నిర్మాణాలు, గ్రంథాలయాలు వంటి మౌలిక సౌకర్యాలు లేని గ్రామీణ ప్రాంతాల్లో మట్టిలోని మాణిక్యాలను వెలికి తీసి దేశానికి అందించిన ఘనత టీచర్స్‌దే.

ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలే తప్ప ప్రైవేట్ స్కూల్సు లేవు. ఈ రోజున దేశ విదేశాల్లో గౌరవించబడుతున్న శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, ఆర్థిక నిపుణులు, మేధావులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న వారే. ఈ ప్రతిభలకు మూల స్తంభాలు టీచర్సే. పిల్లలకు కార్యశాలలు నిర్వహించి, శిక్షణ ఇచ్చి వారిచేత రచనలు చేయించి ఇంత విరివిగా బాల సాహిత్యం రావడానికి కారణం మన టీచర్సేనని మనకు తెలుసు కదా!

పిల్లలలో ప్రేమ, దయ, క్షమ, స్నేహం, సమానత్వం వంటి మానవీయ విలువల పట్ల అవగాహన పెంచి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది టీచర్స్.

టీచర్స్‌కే టీచర్, మన రెండవ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టిన రోజు సెప్టెంబర్ 5న వారి గౌరవార్థం టీచర్స్ డేని జరుపుకుంటున్నాం.

మనం కూడా మన భవిష్యత్ రూపకర్తలైన మన టీచర్స్‌ను గౌరవించుకుందాం. వారికి జేజేలు చెబుదాం.


వేదకుమార్.యం

(మణికొండ వేదకుమార్)

ఎడిటర్ బాలచెలిమి




# జాన్ లోగీ బైర్డ్

గ్లాస్గో సమీపంలో 1888లో జన్మించిన జాన్ లోగీ బైర్డ్ టెలివిజన్ ఆవిష్కర్త. 34 సంవత్సరాల వయస్సులో, అతనికి టెలివిజన్‌ను అభివృద్ధి చేయాలనే తపన కలిగింది. అతనికి అప్పటికే అనేక వ్యాపారాలు ఉన్నాయి. పారిశ్రామిక వజ్రాలు, గాలి-సోల్డ్ షూ తయారీకి సంబంధించిన ప్రక్రియలను కనిపెట్టడంలో అతను త్రుటిలో విఫలమయ్యాడు. తన సాక్స్, సబ్బు వ్యాపారాల అమ్మకాల నుండి మిగిలి మూలధనంతో, అతను స్థలాలను అద్దెకు తీసుకున్నాడు, టెలివిజన్‌లో తన ప్రయోగాలను ప్రారంభించాడు. తరచుగా ఒంటరిగా పని చేస్తూ, అతను స్క్రాప్ మెటీరియల్‌ల నుండి తన ఉపకరణాన్ని మెరుగు పరిచాడు. అతని సిస్టమ్ నిర్వహణకు కీలకమైన పెద్ద స్పిన్నింగ్ డిస్క్ ఉంది. 1883లో పాల్ నిప్‌కోవ్ కనిపెట్టిన ఈ డిస్క్ చుట్టూ రంధ్రాలను కలిగి ఉంది, దీని ద్వారా కాంతి-సెన్సిటివ్ సెల్‌లోకి వెళ్లాలి - ఫోటోసెల్. ఈ రంధ్రాల అమరిక టెలివిజన్‌లో ప్రసారం చేయడానికి చిత్రాన్ని స్కాన్ చేస్తుంది, కానీ రంధ్రాలు సరిపోనప్పుడు, అతను వాటిని మరింత కాంతిని అనుమతించే పెద్ద లెన్స్‌లతో, పెద్ద డిస్క్‌లను రూపొందించాడు. ఎనిమిది అంగుళాల లెన్స్‌లతో ఎనిమిది అడుగుల కంటే ఎక్కువ వ్యాసం కలిగిన డిస్క్‌ను రూపొందించాడు. పూర్తి వేగంతో రన్నింగ్ - 750 rpm వద్ద ఇది ప్రాణాంతకం. భారీ లెన్స్‌లు ఎగిరి పోయాయి, అవి గోడలను తాకినప్పుడు గాజు ముక్కలుగా పగిలిపోయాయి.



మొదటి సిస్టమ్ ఐదు స్కానింగ్ లైన్‌లను మాత్రమే కలిగి ఉంది ఇది. 'షాడోగ్రాఫ్' సిల్హౌట్ అవుట్‌లైన్ ఇమేజ్‌ను మాత్రమే ప్రదర్శిస్తుంది. 'నిజమైన టెలివిజన్' (బైర్డ్ పదాలు) కోసం అవసరమైన బూడిద రంగు షేడ్స్‌ని సృష్టించే వ్యవస్థ చిత్రాన్ని రూపొందించడానికి చిత్రంలో తగినంత వివరాలను కలిగి ఉంది. అతని ప్రయోగాలు మానవ ముఖం యొక్క చిత్రాన్ని రూపొందించడానికి టీవీ లైన్ల కనీస సంఖ్య 30 అని అతనికి సూచించాయి. 2 అక్టోబర్ 1925న అతను ఒక గుర్తించదగిన చిత్రాన్ని నిర్మించినప్పుడు, అది బూడిద రంగు షేడ్స్‌తో పూర్తి అయింది. మరుసటి సంవత్సరం జనవరి 26న అతను టెలివిజన్ ప్రపంచంలో మొట్టమొదటి బహిరంగ ప్రదర్శనను ఇచ్చాడు.

1928 చివరి నాటికి బైర్డ్ అనేక ప్రథమాలను క్లెయిమ్ చేశాడు:


- అతను 1928లో కలర్ టెలివిజన్ వ్యవస్థను అభివృద్ధి చేసాడు, ఇది తరువాత చంద్రుని నుండి ప్రత్యక్ష కలర్ TV చిత్రాలను తీసుకురావడానికి NASA ఉపయోగించే సాంకేతికత ఆధారంగా రూపొందించ బడింది. అతను కలర్ టెలివిజన్ పట్ల ఆకర్షితుడయ్యాడు, 40లలో రంగుల చిత్రాలను ప్రదర్శించాడు. అవి అత్యుత్తమ నాణ్యతతో ఉన్నాయి).
- అతను ఆగస్ట్ 1928లో స్టీరియోస్కోపిక్ టెలివిజన్‌ని ప్రదర్శించాడు.
- అతని ఇన్‌ఫ్రా-రెడ్ టెలివిజన్ (అనేక ఆధునిక CCTV భద్రతా వ్యవస్థలకు ఆధారం) యొక్క ప్రదర్శన శాస్త్రీయ మరియు సైనిక ప్రపంచంలో భారీ ప్రకంపనలు సృష్టించింది.
- USA 'మొదటి' అట్లాంటిక్ టెలివిజన్ చిత్రాలతో విజయం సాధించడానికి దాదాపు 34 సంవత్సరాల ముందు, బైర్డ్ లండన్ నుండి న్యూయార్క్‌కు ప్రత్యక్ష టెలివిజన్ చిత్రాలను ప్రసారం చేయడంలో విజయం సాధించాడు.
- టెలివిజన్ ప్రోగ్రామ్‌లను రికార్డ్ చేయగల అవసరాన్ని ముందుగానే ఊహించి, అతను 'ఫోనోవిజన్'ను అభివృద్ధి చేశాడు, ఇది టెలివిజన్‌ని డిస్క్‌లలో రికార్డ్ చేసే వ్యవస్థ.

బాలచెలిమి డెస్క్



కథ

# ఒకే కుటుంబం



పల్లెటూరిలో ఉండే రాజయ్యకు రెండు ఎకరాల వ్యవసాయభూమి వుంది. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటు న్నాడు. పండిన ధాన్యాన్ని గరిసెల్లో భద్రపరుచు కుంటున్నాడు. కొంత అమ్మేస్తున్నాడు. గరిసెల్లోని ధాన్యాన్ని ఎలుకలు ఎగబడి తినేస్తున్నాయి. అదొక సమస్యగా మారింది.

పిల్లి ఎలుకలను తింటుంది గదా! అందుకే ఎలుకల బాధ తీరేందుకు ఒక పిల్లిని పెంచుకున్నాడు. పిల్లిని చూసి ఎలుకలు పారిపోయినై. ధాన్యం భద్రంగా వుంది.

రాజయ్య రోజూ ఉదయమే పొలానికి వెళ్లేవాడు. అతని భార్య కమల వంటచేసి, పిల్లలను బడికి పంపించేది. తనకు, భర్తకు మధ్యాహ్న భోజనం పొలం వద్దకు తీసుకెళ్లేది.

సాయంత్రం పిల్లలు బడినుండి, రాజయ్య దంపతులు పొలం నుండి వస్తారు. ఈ మధ్యకాలములో ఇంటి కాపలా కోసం ఒక కుక్కను పెంచుకున్నారు. కుక్క ఇంటిని జాగ్రత్తగా కాపలా కాస్తోంది.

కమల రోజూ పిల్లికి, కుక్కకు పాలబువ్వ పెడుతుంది. అవి స్నేహంగా తిరుగుతున్నాయి.

ఒకరోజు రాత్రి ఇంటి వెనక తలుపుల్ని చాకచక్యంగా తెరిచి ఇద్దరు దొంగలు ఇంటిలో ప్రవేశించారు. ఒకడు కత్తి చూపించి బెదిరించి కమల ఒంటిమీదున్న బంగారు నగలివ్వమంటున్నాడు. ఇద్దరు కలిసి రాజయ్య దంపతులను, పిల్లలను ఒకేచోట కట్టి పడేశారు. వారంతా గట్టిగా అరిచారు. అరుపులు విని కుక్క, పిల్లి వారి వద్దకొచ్చినై. సైగలతో సంప్రదించుకున్నై. యజమానికేమీ నష్టం జరగ గూడదనుకున్నై.

కుక్క రోషముతో ఇద్దరు దొంగల పిక్కల్ని కరిచింది. పిల్లి వారి ఒళ్లంతా గీరిపెట్టి రక్కింది. దొంగలకు గాయాలైనాయి. పారిపోలేక కూలబడ్డారు. కుక్క గల్లీలో కెళ్లింది. గట్టిగా మొరిగి జనాలను నిద్రలేపి తీసుకొచ్చింది. జనాలు దొంగల కాళ్లు చేతులు కట్టేశారు. రాజయ్య కుటుంబమువారి కట్లు విప్పారు. దొంగల్ని పోలీసుల కప్పగించారు.

రాజయ్య దంపతులు కుక్క, పిల్లి చేసిన సహాయాన్ని మెచ్చుకున్నారు. ఆ మాటల్ని కుక్క, పిల్లి విన్నాయి. గర్వంగా ముఖాలు చూసుకున్నై. పిల్లి సంతోషంతో “కుక్కన్నా! నేను దొంగల్ని కక్కి గీకిన. నా సాయం వల్లనే యజమానికి ఆస్తి నష్టం జరగలేదు” అన్నది.

కుక్కకు రోషమొచ్చింది. “అదికాదు, నేను దొంగల

పిక్కల్ని కరిచిన, గల్లీలోని జనాలను తీసుకొచ్చిన కాబట్టి నా సాయం వల్లనే మన యజమానికి నష్టం జరుగలేదు.” జవాబిచ్చింది.

అవి రెండూ నేనంటే నేనే సాయం చేశానని వాదించుకో సాగాయి. అప్పుడు రాజయ్య అటువచ్చి అంతా విన్నాడు. విషయాన్ని యజమానికి చెప్పి మీకెవరి వల్ల సాయం జరిగింది? అని అడిగాయి. యజమాని తర్వాత చెప్తానన్నాడు.

అప్పటికే గ్రామంలో పిచ్చి కుక్కల బెడద బాగా పెరిగింది. ఎంతో మందిని పిచ్చి కుక్కలు కరవడముతో బొడ్డ చుట్టూ ఇంజక్షన్లు తీసుకున్నారు. గ్రామపంచాయితీ వారు బజారులో కనబడిన ప్రతి కుక్కనూ కాళ్లు కట్టేసి ట్రక్కులో వేసి తీసుకెల్తున్నారు.

రాజయ్య బజారు కెల్తున్నాడు. పంచాయితీవారు అతని కుక్కను పట్టుకున్నారు. అది కుయ్యో–మొర్రో అని గట్టిగా మొరిగింది. రాజయ్య గబాగబా ట్రక్కు వద్ద కెళ్లి “బాబూ ఇది బజారు కుక్క కాదు. నా ఇంటి కుక్క. దాన్ని పెంచుకుంటున్నాను. అని కుక్కను ఇంటికి తీసుకెళ్లాడు. పిల్లికంతా తెలిసింది.

మర్నాడు గ్రామానికి పిల్లుల కోసం సంచార జాతి వారొచ్చారు. రాజయ్య ఇంటి పిల్లి బజారులో వెల్తూంటే బరిశెలతో దాన్ని వెంబడించారు. రాజయ్య అది చూసి సంచార జాతి వాళ్లను ఆపాడు. “ఇది బజారు పిల్లి కాదు, నా ఇంటిపిల్లి. దీన్ని పట్టుకుంటే మీ అంతుచూస్తా” నని బెదిరించి పిల్లిని ఇంటికి తీసుకొచ్చాడు. ఆ విషయం కుక్కకు తెలిసింది.

కాస్సేపాగి కుక్క పిల్లిని పిలిచి “చూశావా తమ్ముడూ! మన యజమానే మనను రక్షించాడు. మన ప్రాణాలు కాపాడాడు” అంది. రెండింటి గర్వం మాయమైంది.

అది విన్న రాజయ్య ఆ రెండింటినీ దగ్గరకు తీసుకుని “మనదంతా ఒకే కుటుంబం. ఒకరినొకరు రక్షించుకోవడం మనందరి బాధ్యత. ఈ విషయంలో ఎవ్వరూ గర్వపడాల్సిన అవసరం లేదు. సుమా!! అన్నాడు నవ్వుతూ.


అప్పట్నుంచి కుక్క, పిల్లి కలివిడిగా ఉంటున్నాయి.


**ఐతా చంద్రయ్య**



సిద్ధిపేట

m : 9391205299

## మట్టి గణపతులకు ప్రాధాన్యమిద్దాం

### పర్యావరణాన్ని కాపాడుకుందాం



నేల–నీరు, చెట్టు–పుట్ట తదితర ప్రకృతి శక్తులన్నింటినీ ఆరాధించడం మన భారతీయ సంస్కృతిలో ప్రధాన భాగం ఉంది. వినాయక చవితి ఉత్సవాల్లో వివిధ రకాల రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసే విగ్రహాల వల్ల ఏర్పడిన కాలుష్యంతో పర్యావరణానికి ఎంత నష్టం జరుగుతుందో మనకు తెలుసు. ప్రజలకు ఇబ్బందులు సృష్టించే పద్ధతులను పక్కనబెట్టి, పర్యావరణ హిత గణపతులకు(మట్టి గణపతి) ప్రాధాన్యమిద్దాం. పర్యావరణాన్ని పరిరక్షించి భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణ సమాజాన్ని ఇవ్వాల్సిన బాధ్యత మనపై ఉంది.



# రాధిక మీనన్

## బ్రేకింగ్ వేవ్స్ నావిగేటింగ్ సీస్, గైడింగ్ షిప్స్

రాధికా మీనన్ (భారతీయ) ఇండియన్ మర్చంట్ నేవీలో కెప్టెన్. కేరళలోని కొడంగల్లూరులో పుట్టి పెరిగారు. కొచ్చిన్‌లోని ఆల్ ఇండియా మెరైన్ కాలేజీలో రేడియో కోర్సులో చేరారు. ఆమె వృత్తి షిప్పింగ్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియాలో రేడియో అధికారిగా ప్రారంభమయింది.




2012లో భారత మర్చెంట్ నేవీలో తొలి మహిళా కెప్టెన్‌గా నియమితురాలై రాధిక చరిత్రను సృష్టించారు. ఆమె 21, 827 టన్నుల బరువు గల సువర్ణ స్వరాజ్య చమురు ట్యాంకర్‌కు నాయకత్వం వహించారు.

జూన్ 2015లో, బంగాళాఖాతం సముద్ర తుఫానులో చిక్కుకుపోయిన ఏడుగురు మత్స్యకారులను రక్షించినందుకు రాధికా మీనన్‌కు మంచి గుర్తింపు లభించింది. 2016లో ఆమె వీరోచితంగా సముద్రంలో అసాధారణమైన ధైర్య సాహసాలను ప్రదర్శించినందుకు అంతర్జాతీయ మారిటైమ్ ఆర్గనైజేషన్ (ఐఎంఓ)చే అవార్డును అందుకున్న మొదటి మహిళ.

సెప్టెంబరు 2019లో భారత్‌కి లక్ష్మి ప్రచారంలో భాగంగా భారత ప్రభుత్వం ఆమెను సత్కరించినప్పుడు ఆమె సేవలకు మరింత గుర్తింపు లభించింది. ఆమెకు 2022లో నారీశక్తి పురస్కారం కూడా లభించింది.

మొదటి మహిళా కెప్టెన్‌గా ఆమె మార్గదర్శక పాత్ర, సముద్ర భద్రత పట్ల ఆమెకున్న తిరుగులేని నిబద్ధత సముద్ర పరిశ్రమలో మహిళా సాధికారతకు ప్రతీక.

రాధికా మీనన్, సహచర నావికాదళ అధికారులు సునీతి బాలా, శార్వాణీ మిశ్రా ఇంటర్నేషనల్ ఉమెన్ సీఫేరర్స్ ఫౌండేషన్ (ఐడబ్ల్యూఎస్ఎఫ్)ని స్థాపించారు, ఇది ప్రపంచ వ్యాప్తంగా సముద్ర పరిశ్రమలో లింగ సమానత్వాన్ని ప్రోత్సహిస్తుంది.


**– ‘షీరోస్–256 ఇన్‌స్పైరింగ్ వుమెన్ ఫ్రమ్ ఇండియా’**

నుండి....



# గుండ్రం + నిటారు = అందమైన అక్షరం

తెలుగు భాషలోని అక్షరాల అందమంతా వాటిని గుండ్రంగా రాయడంలోనే దాగి ఉంది. ఎప్పుడైనా మీ చేతిరాత అంత స్పష్టంగా, కంటికి ఇంపుగా కనపడకపోతే... వెంటనే 2-3 నిమిషాలు సవ్యదిశలో మరియు అపసవ్య దిశలో “సున్న” ఆకారాన్ని అభ్యసించి తిరిగి రాయడం ప్రారంభించండి. అలాగే అక్షరాలు ఎడమ వైపుకు గానీ, కుడి వైపుకు గానీ వంగకుండా చూసుకోవాలి. గుండ్రంగా, నిటారుగా ఉన్న అక్షరాలు చూడ ముచ్చటగా ఉంటాయి. ఉదారణకు :



పైన చూపిన విధంగా తలకట్టు లేని ‘క’ ఆకారం రెండు సున్నాల కలయికగా గుర్తించి పట్టు సాధించిన తరువాత ఆ ఆకారం మీద ఏ గుణింతం కావలిస్తే ఆ గుణింతాన్ని (గుండ్రని ఆకారాలు వచ్చినప్పుడు గుండ్రంగా రాస్తూ) రాస్తే అందమైన చేతిరాత మీ సొంతం.


ఈ భాగంలో హల్లులను క్రింద చూపిన విధంగా అభ్యసించండి. తరువాత కేవలం అక్షరాలతో తయారు చేయగలిగే – తల, పలక, మరల, సరళ, పడవ... వంటి పదాలను అభ్యసించండి.

| | | | | | |
|---|---|---|---|---|---|
| క | ఖ | గ | ఘ | ఙ | |
| చ | ఛ | జ | ఝ | ఞ | |
| ట | ఠ | డ | ఢ | ణ | |
| త | థ | ద | ధ | న | |
| ప | ఫ | బ | భ | మ | |
| య | ర | ల | వ | శ | ష |
| స | హ | ళ | క్ష | ఱ | |

– వై. మల్లికార్జున రావు



డైరెక్టర్, మహా అకాడెమి, m : 9966961642





# ఎస్ఎస్ఎల్వి - డి 3 రాకెట్

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో (ISRO) చేపట్టిన ఎస్ఎస్ఎల్వీ-డీ3 రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. ఆగస్టు 16 (శుక్రవారం) ఉదయం 9.17గంటలకు నెల్లూరు జిల్లా శ్రీహరికోట షార్(Shar) నుంచి 175 కిలోల ఈవోఎస్ -08 ఉపగ్రహాన్ని ఎస్ఎస్ఎల్వీ-డీ3 రాకెట్ నింగిలోకి మోసుకెళ్లింది. ఈ ప్రయోగం మొత్తం 17 నిమిషాలపాటు సాగింది. షార్‌లోని మొదటి లాంచ్ ప్యాడ్ నుంచి ఈ వాహక నౌక నింగిలోకి దూసుకెళ్లింది. ఇస్రో శాస్త్రవేత్తలు ఈవోఎస్-08 ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. చిన్న చిన్న శాటిలైట్లను అభివృద్ధి చేయటం, అందుకు అనుకూలమైన పేలోడ్ పరికరాలను రూపొందించే లక్ష్యంలో భాగంగా ఇస్రో ఈ ప్రయోగాన్ని చేపట్టింది. 'ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్' ఈవోఎస్-08ను (EOS-08 mission) తక్కువ ఎత్తులోని భూ కక్ష్యలోకి ప్రవేశపెట్టడం ఈ మిషన్ లక్ష్యం.

విపత్తు నిర్వహణలో సమాచారం ఇచ్చేందుకు ఈ ఉపగ్రహం ఉపయోగపడనుంది. పర్యావరణం, ప్రకృతి విపత్తులు, అగ్ని పర్వతాలపై ఇది పర్యవేక్షించనుంది. ఇస్రోకు చెందిన యూఆర్ రావు శాటిలైట్ సెంటర్‌లో ఈవోఎస్‌ను అభివృద్ధి చేశారు. ఇందులో ఉండే ఎలక్ట్రో ఆప్టికల్ ఇన్‌ఫ్రారెడ్ (ఈవోఐఆర్) పేలోడ్ మిడ్-వేవ్, లాంగ్ వేవ్ ఇన్‌ఫ్రా-రెడ్‌లో చిత్రాలను క్యాప్చర్ చేస్తుంది. విపత్తు నిర్వహణలో ఈ సమాచారం ఉపయోగపడుతుందని ఇస్రో పేర్కొంది. ఈ విజయంతో శాస్త్రవేత్తలు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఒకరినొకరు అభినందనలు తెలుపుకున్నారు. ఇస్రో చైర్మన్ సోమనాథ్ శాస్త్రవేత్తలను అభినందించారు.

**– సచిన్ కోత్వాల్**

బాలచెలిమి డెస్క్, m : 8686664949

కథ

# కొత్త బడి




శ్యామ బడి నుండి వచ్చే సమయం అయిందని వాళ్ల అమ్మ గేటు దగ్గర ఎదురుచూస్తోంది. శ్యామ వాళ్ల నాన్న బదిలీ మీద ఈ ఊరు వచ్చారు. అంతకు ముందు వాళ్లు ఉన్న ఊర్లో ఒకటి నుండి ఐదో తరగతి వరకు చదివింది. ఇక్కడ పన్నెండో తరగతి వరకు ఉన్న పెద్ద బడిలో చేర్పించారు. అంతలో శ్యామ స్కూల్ బస్సు వచ్చింది. కొత్త స్కూల్‌లో శ్యామ స్నేహితుల గురించి, టీచర్ల గురించి తెలుసుకోవాలని వాళ్ల అమ్మ అనుకుంది. స్కూల్ విశేషాల గురించి అడిగితే పాత స్కూల్‌కే వెళ్లాలని ఉందమ్మా అంటూ లోపలికి వెళ్లింది.

తరువాతి రోజు కూడా అలాగే నీరసంగా బడి నుండి వచ్చింది. శ్యామ వాళ్ల నాన్న కూడా కొత్త స్కూల్ ఎలా ఉందని అడిగాడు. స్కూల్ బాగుంది. ఆటలు ఆడడానికి పెద్ద మైదానం ఉంది. టీచర్లు బాగా పాఠాలు చెబుతారని చెప్పింది. కాని పాత స్కూలే నచ్చిందన్నది. నాలుగు రోజులు అలవాటైతే నీకు చాలా మంది స్నేహితులౌతారు. అప్పుడు ఈ స్కూలే బాగుందని అంటావని చెప్పారు.

ఆ రోజు ఆదివారం. శ్యామ నిద్రలేస్తుంటేనే ఎవరిదో కొత్త గొంతు వినిపించింది. చూస్తే బామ్మ. శ్యామకి ఇష్టమైన స్నేహితురాలు కూడా బామ్మే. ఇద్దరూ బోలెడు కబుర్లు చెప్పుకున్నారు. అలాగే కొత్తబడిలో తనకు వచ్చిన కష్టం గురించి కూడా చెప్పుకుంది. బామ్మ నవ్వి, దాని సంగతి నేను చూస్తాను. ఒక వారం రోజులు ఓపికతో ఉండమని చెప్పింది. మరునాడు బామ్మ శ్యామకు జడలు వేస్తూ, జుట్టు పొడవుగా బాగుందని మెచ్చుకుంది. శ్యామా నవ్వుకుంటూ బస్సు రావటంతో స్కూల్‌కి వెళ్లిపోయింది.


శ్యామా బడి నుండి ఆనందంగా వచ్చింది. బామ్మా ఈ గురువారం స్వాతంత్ర్య దినోత్సవం. నేను నృత్య నాటికలో భారతమాత వేషం వేస్తున్నాను. అమ్మ నాన్నలతో నువ్వు కూడా చూడడానికి రావాలని చెప్పింది.

శ్యామ నృత్యనాటికలో భారతమాత వేషానికి చాలా బాగుందని, పొడవాటి జుట్టు వలన ఇంకా అందంగా కనిపించిందని టీచరు మెచ్చుకుంది. శ్యామా స్నేహితులందరూ కూడా నీ జుట్టు బాగుంటుందని ఈ రోజే తెలిసింది. చూడు మావన్నీపొట్టివి, పోనీటైల్ వేసుకోవడానికే సరిగ్గారావడం లేదు. నీలాగా మేము జుట్టు పెంచుకోవాలనుకుంటున్నామని చెప్పారు. శ్యామా వారివంక ఆశ్చర్యంగా చూసింది. స్కూల్‌కి వచ్చిన మొదటి రోజు వీళ్లే ఇంత పొడుగు జడా, దానికి కుచ్చుల రిబ్బన్లు. మాకు నవ్వు వస్తోందని ఆట పట్టించారు. అందుకే శ్యామా తనకు ఇష్టమైన జుట్టును కత్తిరించుకోవాలను కుంది. అదే విషయాన్ని బామ్మకి చెప్పింది. ఇంటికి వస్తూ బామ్మతో నేను జుట్టు కత్తిరించుకోనని చెప్పింది. అలాగే శ్యామ వాళ్ల నాన్నతో నువ్వు చెప్పినట్లు నాకు ఈ కొత్తబడిలో స్నేహితులు దొరికారు. బడి కూడా నచ్చిందని చెప్పింది.

డా.నీరజ అమరవాది
m : 9849160055



# ఇద్దరు దోస్తులు



ఇద్దరు దోస్తులు అడవిపక్కనుండి వెళుతున్నారు. ఎలుగ్గొడ్డు ఒకటి వాళ్లకి ఎదురైంది. ఒకడు పరుగెత్తి చెట్టు ఎక్కాడు. రెండోవాడు ఒంటరిగా వుండిపోయాడు. ఏమి చేసేందుకూ లేక చప్పున కిందపడి చచ్చి పోయినట్టు నటించాడు.

ఎలుగ్గొడ్డు వాడి దగ్గరకు వచ్చి చుట్టూ వాసన చూసింది. వాడు ఊపిరి బిగబట్టుకున్నాడు.

ఎలుగ్గొడ్డు వాడి ముఖం వాసన చూసి చచ్చిన మనిషి అనుకుని అక్కడనుండి వెళ్లి పోయింది. ఎలుగ్గొడ్డు వెళ్లిపోయాక, ఆ రెండవవాడు చెట్టు దిగి, నవ్వుతూ: "ఏమిరా! ఎలుగ్గొడ్డు నీ చెవిలో ఏదేనా రహస్యం చెప్పిందా ఏమిట్రా?" అని అడిగాడు. "ఆపదలో అడ్డుపడేవాడే చుట్టం అని చెప్పిందిరా!"

**లియో టాల్ స్టాయ్ బాలల కథలు నుండి**



కథ

# తెలివైన మాచె




ఇది పాతకాలం ముచ్చట. ఒక ఊరిలో మాచె అనే పేరు గల ఒక తెలివైన వాడు ఉండేవాడు. చాలా రోజుల నుండి అతనికి మిథున్ (ఈశాన్య రాష్ట్రాల పర్వత ప్రాంతాలలో ఉండే పశువు) కొనాలనే కోరిక ఉండేది. ఆ కోరిక ఈ రోజు నెరవేరనుంది, అందుకే అతను చాలా సంతోషంగా ఉన్నాడు.

దగ్గరలోని ఊరిలో మిథున్ కొనటానికి అతను వెళ్ళాడు. ఎప్పుడైతే అతను మిథున్ కొని తన ఊరికి తిరిగి వస్తున్నాడో దారిలో అతనికి ఒక పులి ఎదురైంది.

ఆ పులి చాలా ఆకలితో ఉంది. అది మాచె దారికాచి 'మాచె మనమిద్దరం కుస్తీ పడదాం' అంది.

'నేను కుస్తీ పట్టడానికి సిద్ధమే కాని ఒక సమస్య ఉంది. మనమిద్దరం కుస్తీ పడితే నా మిథున్ను ఏం చేద్దాం? అదిపారిపోతుంది' అని మాచే పులితో అన్నాడు.

పులి చెట్టుకు కట్టేయమని సలహా ఇచ్చింది. 'నా మిథున్ చాలా బలవంతుడు, అది చెట్టును వేర్లతో సహా ఊడబీకి పారిపోతుందని' మాచె చెప్పాడు. అప్పుడు ఇద్దరు ఆలోచనలో పడ్డారు. "మహారాజా! ఒక పని చేద్దాము. మీరు నా మిథున్ని తాడుతో మీ నడుముకు కట్టుకోండి. దాని తర్వాత మనమిద్దరం కుస్తీ పడుదాం" అన్నాడు.

'సరే! మిథున్ని నా నడుముకు కట్టేయి" అంది పులి, ఒక తాడుతో మాచె మిథున్ని పులి నడుముకు కట్టాడు. మాచె నడుముకు ఒక బట్ట కట్టి ఉంది. "మహారాజా! నేను నా నడుముకు ఉన్న బట్ట తీసేస్తాను, తర్వాత మనమిద్దరం కుస్తీ పడదాం, అని మాచే తన నడుముకున్న బట్టను తీసి గట్టిగా దులిపాడు. బట్టను గట్టిగా దులిపిన శబ్దం విని భయపడిన మిథున్ పరుగెత్త సాగింది.

మిథున్ పులి నడుముకు కట్టి ఉండడంతో, మిథున్ పరుగెత్తడంతో పులి భూమికి గీరుకుపోయి రక్తసిక్తమై చివరకు చనిపోయింది.

మాచె తన తెలివితో పులిని తుదముట్టించాడు. మిథున్ని వెంటపెట్టుకొని ఊరికి పయనమయ్యాడు.

– డా. షేక్ అబ్దుల్ ఘనీ
m : 99481 30168

ఆట

# నాలుగు రాళ్ళ ఆట



ఎంతమంది పాల్గొనవచ్చు - ఐదుగురు
ఎక్కడ ఆడవచ్చు - గ్రౌండ్‌లో
ఈ ఆటకు గల ఇతర పేర్లు - చారు పత్త, చార్ పత్తర్, చారుపల్లి, లచ్చేరు బుచ్చేరు, కజ్జికాయలు

'నాలుగు రాళ్ళ ఆట'లో పాల్గొనే ఐదుగురు పిల్లలు పంటలు వేయడం ద్వారా ఒకరు దొంగగా మిగిలిపోతారు. బొమ్మలో చూపిన విధంగా నేల మీద పెద్ద చతురస్రాకారం గడిని ముగ్గుతో గీసి, దాన్ని నాలుగు గడులుగా విభజించాలి. నాలుగు గడులు కలిసే చోట (మధ్యలో) చిన్న వృత్తాన్ని గీసి, ఆ వృత్తంలో నాలుగు రాళ్ళను పెట్టాలి.

నలుగురు పిల్లలు నాలుగు గడులలో నిలబడాలి. దొంగ అయిన పిల్లవాడు రాళ్ళకు కాపలా కాస్తూ గీత మీద ఆ వైపు నుంచి ఈ వైపు చివర వరకు నడవాలి. మిగతా నలుగురు పిల్లలు ఆ రాళ్ళను తీసుకెళ్ళి వాళ్ళ గడుల్లో వేసుకొనే ప్రయత్నం చేయాలి.

ఉదా: ఒక పిల్లవాడు నాలుగు రాళ్ళనీ తెచ్చుకోవచ్చు. అయితే మళ్ళీ ఆ రాళ్ళని, ఆ పిల్లవాడు గాని లేదా తోటి ఆటగాళ్ళు గాని ఒక్కో రాయిని ఒక్కో గడికి చేర్చాలి.

ఇలా చేస్తున్నప్పుడు దొంగకు దొరకకుండా తమ గడిలోకి రావాలి. ఇలా రాళ్ళను ఒక్కొక్క గడిలో ఒక్కొక్కటి తీసుకొచ్చి పెట్టిన తరువాత నలుగురు పిల్లలు ఏదో ఒక గడిలో నిలబడాలి. అయితే రాయి గాని, మనిషి గాని గడిలో తప్పకుండా ఉండాలి. అప్పుడు ఆట పూర్తయినట్టు.

ఖాళీ గడి ఉంటే, దొంగ ఆ గడిలోకి వెళ్ళితే ఖాళీచేసి వెళ్ళిన పిల్లవాడు దొంగ అవుతాడు. లేదా గడులు దాటుతున్నప్పుడు దొంగకు దొరికిపోయిన వాళ్ళు దొంగ అవుతారు.


ఆట మళ్ళీ మొదలవుతుంది. రాళ్ళను కాపాడుకోవటం, గడులు దాటే వాళ్ళను పట్టుకోవటంలో దొంగ జాగ్రత్తగా ఉండాలి. రాళ్ళను విసిరి వేయకుండా గడి లోపలికి వెళ్లి పెట్టాలి.

ప్రయోజనం: ఈ ఆట ఆడటం ద్వారా పిల్లల మధ్య సమన్వయం, చురుకుతనం పెరుగుతాయి.

- 'చిన్ననాటి ఆటలు-జ్ఞాపకాల మూటలు' నుండి...

కథ

# అభినందనీయం




గోపాలపట్నంలో చదువుతున్న చందు దసరా సెలవులకు ములకం పల్లిలోని వాళ్ల ఇంటికొచ్చాడు.

మాటల్లో భాగంగా "మన వరి పొలం ఎలాగుంది?" అని అడిగాడు చందు. "మంచిగనే వుంది కాని, పొలానికే నీళ్లు పెట్టాల్సివుంది". అన్నాడు చందుతో తండ్రి రామయ్య.

"ఎక్కడి నీళ్లు నాన్న?" అని మళ్ళీ అడిగాడు చందు. "అదేరా మన ఊరి పెద్ద చెరువు. అదే రైతులందరిని ఆదుకుంటుంది". అన్నాడు రామయ్య "మన పొలంలో మనం పంపుసెట్ వేయించుకుంటే ఏమయితది" అని అడిగాడు చందు.

"పిల్ల కాకి కేమెరుక ఉండేల దెబ్బరా! మన పంటలు అంతంత మాత్రమే. పొలాలకి కరెంటు లైన్ లేదాయే ఇంగ పంపుసెట్ ఏమీ వేయించుకోగలమురా!" అన్నాడు బాధగా రామయ్య.

"సర్లే కాని యిన్ని రోజులు పొలానికి నీళ్ళెందుకు పెట్టలేదు" అని అడిగాడు చందు.

"ఆ చెరువు మన సొంతమనుకుంటున్నావా! రోజుకొకరు చొప్పున పెట్టుకోవాలా! యియ్యాల రాత్రి మన వంతు వచ్చింది. అందుకే రాత్రి మనం పొలానికి పోవాలి" అన్నాడు రామయ్య.

"అయ్యో రాత్రి పూట చిన్నోడికి భయం వేయదు! అసలే మన పల్లెలో రాత్రి దెయ్యాలు తిరుగుతున్నాయని అనుకుంటున్నరు" అని వంటింట్లో నుంచి వచ్చిన చందు తల్లి లచ్చమ్మ అంది.

"చందు చిన్నోడేమికాదు తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. పెద్ద పెద్ద మాటలు చెపుతున్నడు". అని వెటకారంగా అన్నాడు రామయ్య.

"నేను పొలానికి రాత్రే కాదు, అర్ధరాత్రయినా వస్తాను, నాకేమీ భయంలేదు నాన్న" అన్నాడు చందు.

"మీ తండ్రి కొడుకుల ముచ్చట ఆపుండి, ముందు బువ్వకి లేండి" అంది లచ్చమ్మ.

భోజనాలయిన తర్వాత రాత్రి తండ్రి కొడుకులు వాళ్ళ వరి పొలానికెళ్ళారు. తండ్రి రామయ్య పొలం దగ్గరే నీళ్లు మళ్లిస్తుండగా, కొడుకు చందు చేతిలో పారతో చెరువుకేసి నడుస్తుండగా, వాళ్ళ పొలం దాటాక మరో పొలంలో ఓ తెల్లని ఆకారం చందు కంటబడింది! ఆ ఆకారం "దెయ్యం" కాబోలు అనుకొని ముందుకు వెళ్ళాల, వెనకకు వెళ్ళాల సందిగ్ధంలో వున్న చందుకు 'అసలు దెయ్యాలు లేనే లేవు. అవన్నీ మన భయాలు' అని వాళ్ళ సైన్స్ టీచర్ చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి. అంతే ఒక అడుగు ముందుకేసి "ఎవరు?" గట్టిగా అన్నాడు చందు. ఆ ఆకారం మెల్లగా కదలసాగింది!

"ఎవరు? మీరు" అని మళ్ళీ అడిగాడు చందు. "నేనే" అని బదులుపలికింది. ఆ తెల్లని ఆకారం "నేనే అంటే ఎవరు?" దగ్గరగా వెళ్ళి అడిగాడు చందు.

"నేను రంగయ్యను" అంటూ తలపాగా తీసి నిలబడి అన్నాడు. "రంగయ్య మామ భలేటోడివి. ఎవరయినా అయితే భయపడేవారు కదా! దెయ్యం అనుకొని ఊరంతా చెప్పేవారు!!" అని కోపంగా అన్నాడు చందు.


ఇంతలోనే తమ పొలాల్లోకి కావలా పడుకోవడానికి రైతులు కొర్రాయులు చేతిలో పట్టుకొని వస్తూ దారిలో వున్న చందును "ఏమయిందని?" అడిగాడు.


అప్పుడు చందు ఆ రైతులకి జరిగిందంతా చెప్పాడు. పల్లె జనాలు దెయ్యాల భయంతో వణికి పోతున్నారు. పొలాలకి ఒంటరిగా రావడానికి వెనకాడుతున్నారు! చిన్నవాడవైనా అందరికీ ధైర్యాన్నిచ్చే మాగొప్ప పనిచేసినవు" అని రైతులందరూ ముక్త కంఠంతో అన్నారు. పని చేయకుండా దొంగతనాలు చేస్తున్న రంగయ్యను చివాట్లు పెట్టి, ఎవరి పొలాల్లోకి వారు వెళ్ళిపోయారు.

తెల్లవారాక పల్లెటూరంతా చందు ధైర్యం గురించి చెప్పుకున్నారు. ఆ పల్లెలో దెయ్యాల భయం తగ్గిపోయింది! పల్లె ప్రజలందరూ సరదాగా దసరా పండుగను జరుపుకున్నారు.

చందూ వాళ్ళ పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో పాల్గొని "పల్లెటూరిలో మూఢనమ్మకాలు" అనే అంశం గురించి వాళ్ళ పల్లెటూరి పొలంలోని తన అనుభవాన్ని పూస గుచ్చినట్టు చక్కగా చెప్పి, ఆ పోటీల్లో ప్రథమంగా నిలిచాడు. పాఠశాల వార్షికోత్సవం రోజు పిల్లలందరికీ బహుమతులు ప్రధానం చేసిన ప్రధానోపాధ్యాయులు చలం గారు చందు ధైర్యం గురించి చెప్పి చందును పాఠశాల ఉత్తమ విద్యార్థిగా కూడా ప్రకటించారు. చందును అందరూ అభినందించారు.

**అమ్మిన వెంకట అమ్మిరాజు** 
లక్ష్మీపురం, పేరూరు, ములుగు (జిల్లా)
m : 94407 08656





# ఆచార్య దేవోభవ

acharya devo bhava

**గురుర్బ్రహ్మ గురువిష్ణు**
**గురుదేవో మహేశ్వర హ**
**గురు సాక్షాత్ పరబ్రహ్మ**
**తస్మైశ్రీ గురవే నమః**

మనిషి పుట్టినప్పటి నుండి చనిపోయే వరకు నేర్చుకుంటూనే ఉంటాడు. ఆ నేర్చుకునే క్రమంలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఎందరినో స్ఫూర్తి ప్రదాతలుగా స్వీకరిస్తాడు. అనుసరిస్తాడు. నూతనంగా ఆవిష్కరింపబడతాడు. తనకంటూ ఒక ప్రత్యేకతను ప్రదర్శిస్తాడు. దీనంతటికీ కారణం గురువు. అమ్మ ఒడి నుండి బడి ఒడిలోకి చేరిన పిల్లలకు ఉపాధ్యాయులే తల్లి, తండ్రి, గురువు, దైవం. అక్షరజ్ఞానంతో అంధకారాన్ని తొలగిస్తూ, సత్ప్రవర్తన, కలివిడితనం, ప్రేమతత్వం, మానసిక వికాసం, సహకారం, మొదలైన వాటితో పాటు భవిషత్‌దారులన్నీ ఉపాధ్యాయుల ద్వారానే నేర్చుకుంటారు. ఉపాధ్యాయుడు కేవలం పాఠ్యపుస్తకాలోని పాఠాలు చెప్పడానికే పరిమితం కాకుండా విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు స్నేహితుడిగా శ్రేయోభిలాషిగా మారి అంతర్గతంగా ఉన్న అభిప్రాయాలను తెలుసుకొని, అంతర్గత శక్తులను వెలికి తీసి మానసిక, శారీరక దృఢత్వానికి పునాదులు వేస్తారు. సమస్యతో సందిగ్ధ పరిస్థితుల్లో ఉన్నప్పుడు గుర్తుకు వచ్చే తొలి వ్యక్తి ఉపాధ్యాయుడు. విజయాలు సాధించినప్పుడు గుర్తుకు వచ్చే తొలి వ్యక్తి ఉపాధ్యాయుడు. అందుకే ఉపాధ్యాయ వృత్తి నుండి భారత రాష్ట్రపతిగా అత్యున్నత స్థానాన్ని పొందిన సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు "ఉపాధ్యాయులు దేశంలో అత్యుత్తమ ఆలోచన గలవారు" అన్నారు. గొప్ప దేశభక్తుడు, జ్ఞాని, తత్వవేత్త, అన్నిటిని మించి గురువులకే గురువు అయిన సర్వేపల్లి రాధాకృష్ణ గారి పుట్టిన రోజున ప్రతి విద్యార్థి తమ గురువులను గౌరవించుకుంటారు. ప్రతి వ్యక్తి ఉపాధ్యాయులతో ఉన్న అనుబంధాలను గుర్తు చేసుకుంటూ, కుటుంబ సభ్యులతో మిత్రులతో పంచుకుంటారు. ప్రతి వ్యక్తి ప్రతిక్షణం ఉపాధ్యాయులను స్ఫూర్తి ప్రదాతలుగా నెమరు వేసుకుంటారు. దూర ప్రాంతాలలో ఉన్నా మనసులోనే పాదాభివందనాలు సమర్పించుకుంటారు.

**సయ్యద్ షఫీ**
తెలుగు ఉపాధ్యాయుడు,
తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత
G.H.S. మోమినాన్, ఖమ్మం, m : 99442 73063

చందదారులుగా చేరండి! **బాల చెలిమి** చందదారులను చేర్పించండి!

'ఎం.వేదకుమార్ సంపాదకత్వంలో వెలువడుతున్న 'బాల చెలిమి' పిల్లల మాసపత్రిక బాలబాలికలకు చేరడంలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయ, పాఠశాల నిర్వహకుల, మేధావుల అమూల్య సహకారాన్ని కోరుతున్నాం. చందదారులుగా చేరడంతోపాటు తమకు తెలిసినవారిని చందదారులుగా చేర్పించాల్సిందిగా అభ్యర్థిస్తున్నాం.

**మా చిరునామా :**
BALA CHELIMI
"CHANDRAM" 3-6-712/2,
St.No. 12, Himayatnagar
Hyderabad - 500 029.
Mob: 9030626288
E-mail:desk.chelimi@gmail.com,
www.balchelimi.com

**చందా వివరాలు :**
విడి ప్రతి : రూ. 40
వార్షిక చందా : రూ. 400
2 సం॥లకు : రూ. 750
*'బాల చెలిమి' పేరిట నగదు, చెక్ లేదా ఆన్‌లైన్ రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.*

**ACCOUNT DETAILS :**
Bank Name : Canara Bank
A/C No. : 30101010003714
Branch : Ashoknagar, HYDERABAD.
IFSC Code : CNRB0013010






# ప్రకృతి నిర్మిత బొర్రా గుహలు

## A Journey in the Heart of the Earth

ప్రకృతిలో చాలా అద్భుతాలు, అందాలు, ఆనందాలు ఉన్నాయి. భూమి ఉపరితలం కింద మనం ఊహించని అద్భుతాలు ఎన్నో ఉన్నాయి. అలాంటి అద్భుతాల కోసం బొర్రాగుహలు చూడాలి. బొర్రా గుహలను సందర్శించడం అంటే అది 'ఎ జర్నీ ఇన్ ది హార్ట్ ఆఫ్ ది ఎర్త్'. నిజంగానే భూ హృదయంలో ప్రయాణించడమే.

ఇవి ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్ (విశాఖపట్నం)కి 90 కిలో మీటర్ల దూరంలో ఉన్నాయి. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి రోడ్డు రవాణా, రైలు, విమాన సౌకర్యాలు ఉన్నాయి. బొర్రా గుహలు అతిప్రాచీనమైనవి. సహజమైనవి. బొర్రా గుహలు 150 మిలియన్ సంవత్సరాల నాటివని అంచనా. 80 మీటర్ల లోతు, 200 మీటర్ల పొడవు కలిగి ఉన్నాయి. వీటిలో వైవిధ్యమైన అందాల అనేక గదులు, మార్గాలు ఉన్నాయి. 1807లో బ్రిటిష్ జియాలజిస్ట్ విలియం కింగ్ వీటిని కనుగొన్నారు. దగ్గర్లోని కొండల్లో నివశించే బొర్రా అనే ఒక స్థానిక తెగ పేరును ఈ గుహలకు పెట్టాడు. ఆ గుహలకు ఆ పేరు రావడానికి వేరే పురాణ గాధలూ ప్రచారంలో ఉన్నాయి. బొర్రా అనే పదానికి రంధ్రం అనే అర్థం కూడా ఉంది. అందువల్ల కూడా వీటికి ఆ పేరు వచ్చి ఉండవచ్చు.

బొర్రా గుహలు ఒక సహజ అద్భుతం మాత్రమే కాదు. గొప్ప భౌగోళిక, సాంస్కృతిక వారసత్వ సంపద. గుహలపై కప్పు నుండి కారుతున్న నీటి నుండి ఏర్పడిన స్టాలక్లైట్స్, స్టాలగ్మైట్స్ ఖనిజాలు వేర్వేరు ఆకారాలు, పరిణామాలు, రంగులలో ఉంటాయి. వాటిలో కొన్ని జంతువులు, మానవులు, దేవతలు, వస్తువులను పోలి ఉంటాయి. శివలింగం, తల్లీబిడ్డ, మొసలి, పుట్టగొడుగు, ఆలయం, మానవ మెదడు వంటి నిర్మాణాలున్నాయి. ఈ గుహలలో చరిత్ర పూర్వ కాలం నాటి చిత్రాలు ఉన్నాయి. ఇవి ప్రాచీన ప్రజల జీవితం, సంస్కృతిని వర్ణిస్తాయి. ఇక్కడికి దగ్గర్లోనే అనంతగిరి కొండలు, గోస్తనీ నది, పచ్చని లోయలు, జలపాతాలు ఉన్నాయి. ట్రెక్కింగ్, క్యాంపింగ్, పారాగ్లైడింగ్ వంటి అడ్వెంచర్స్ కూడా ఉన్నాయి. ఆంధ్రా ఊటీగా పిలవబడే అరకు కూడా దగ్గరే. ఇక్కడి అందాల గురించి మరోసారి చెప్పుకుందాం. ఈ బొర్రా గుహలను చూడడానికి దేశ, విదేశాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. శివరాత్రి, కార్తీక పౌర్ణమి రోజుల్లో స్థానిక ప్రజలు వేలాదిగా వస్తారు. సెలవు రోజుల్లో అమ్మా నాన్నలతో ఒక ట్రిప్ వేయండి. పుడమి హృదయపు లోతుల్లో విహరించండి.

జుగాష్ విలి
తెనాలి, m : 98482 66384

నాటిక

# ప్రయత్నిస్తే




### 1వ దృశ్యం

తండ్రి : ఆదర్శవంతంగా 30 ఏళ్ళ ప్రభుత్వ ఉద్యోగాన్ని నీతిగా నిజాయితీగా పూర్తి చేసాను. నాకు తోచినంత సమాజ సేవను చేసాను. కానీ నా యిద్దరు కొడుకుల్లో ఎవర్నైనా ఒకర్ని "కలెక్టరు" గా చూడాలనుకుంటున్నాను. నా కలను వీళ్ళు నెరవేరుస్తారో లేదో? పెద్దవాడి డిగ్రీ పూర్తయ్యింది ఏమంటాడో!

రాము : నాన్న గారూ! మీరేమీ దిగులు పడకండి! పెద్ద కొడుకుగా మీ ఆశయాన్ని నెరవేర్చే బాధ్యత నాది! నేను తప్పక కలెక్టర్ కోసం పరీక్ష రాస్తాను.

తండ్రి : సంతోషం

రాజు : కానీ... నాన్న గారూ...!

తండ్రి : చెప్పు చెప్పు, నీకేం కావాలి!

రాము : నాన్నా! ఆ ఐఏఎస్ పరీక్ష కోసం కావాల్సిన పుస్తకాలు యిక్కడ దొరకవు. ఢిల్లీ నుంచి తెప్పించుకోవాలి..! చాలా ఖర్చవుతుంది.

తండ్రి : ఖర్చుకు భయపడేది లేదు! నీకు కావాల్సిన పుస్తకాలను తప్పకుండా తెప్పించుకో! ఇదిగో ఈ పదివేల రూపాయలు యిప్పుడే తీసుకో!

### 2వ దృశ్యం

రాము : థాంక్యూ! నాన్నా! ఈ రోజే యం.ఓ. చేస్తాను. పుస్తకాలు తెప్పించుకుంటాను. తప్పక ఐ.ఏ.ఎస్. కు ప్రిపేర్ అవుతాను.

తండ్రి : ఆల్ ది బెస్ట్!

రాము : (టేబుల్ మీద చాలా పుస్తకాలను చూస్తూ...) అమ్మో యిన్ని పుస్తకాలను చదువాల్నా! ఒక్కొక్కటీ యింతింత వున్నాయి. నేను చదవగలనా? అనవసరంగా ఐ.ఏ.ఎస్. చదువుతానని పెద్ద బిల్డప్‌నిచ్చా! నా వల్ల కాదు! అమ్మో.... నేను చదవలేను... నాన్నకు చెప్తాను.

రాము : నాన్న గారూ!

తండ్రి : ఏం రామూ!

రాము : ఇన్ని పుస్తకాలు నేను చదవలేను నాన్నా! ఐ.ఏ.ఎస్. చదవడం నా వల్ల కాదు!

తండ్రి : సరే... ఏం చేస్తాం... నీ యిష్టం.... చిన్నవాడికైనా ఈ పుస్తకాలు పనికి వస్తాయేమో? వాడేమంటాడో? ఏరా చిన్నోడా?

శ్యాం : నాన్నా! నేను అన్నయ్య పరిస్థితి గమనించాను! నా డిగ్రీ కూడా ఈసారి అయిపోతుంది కదా! నేను తప్పక ఐ.ఏ.ఎస్. చదువుతాను!

తండ్రి : సంతోషం నాన్నా! ఈ పుస్తకాలన్నీ జాగ్రత్తగా నీ దగ్గరే పెట్టుకో!

శ్యాం : అలాగే నాన్నా!

తండ్రి : ఏరా శ్యాం! డిగ్రీ అయిపోయింది కదా! ఐ.ఏ.ఎస్. కోసం చదవటం మొదలు పెట్టావా! పరీక్షకు ఫీజు కట్టావా?

శ్యాం : అవును నాన్నా! 'ప్రిలిమినరీ' పరీక్ష కోసం ఫీజు కట్టి సీరియస్ గా చదువుతున్నాను. రోజుకు 8 గం.లు కష్టపడుతున్నాను.

తండ్రి : వెరీగుడ్ అలాగే చదువు నాన్న!

శ్యాం : గుడ్ న్యూస్! నాన్నా! నేను ప్రిలిమినరీ పాస్ అయ్యాను!

తండ్రి : సంతోషం! ఇప్పుడేం చేస్తావ్ మరి!

శ్యాం : 'మెయిన్స్' కోసం మళ్ళీ చదవాలి నాన్నా! ఈసారి రోజుకు కనీసం 12 గంటల పాటు కష్టపడాలి! ఒక సంవత్సరం చదవాలి!

తండ్రి : సరే! కొనసాగించు!

### 3వ దృశ్యం

శ్యాం : అబ్బా!... ఆరు నెలల నుంచి ఒకటే చదువు! చచ్చిపోతున్నా! మా ఫ్రెండ్స్ హాయిగా కంప్యూటర్ కోర్సులు చేసి ఉద్యోగాలు తెచ్చుకున్నారు. నా పరిస్థితే అర్థమవడం లేదు! ఇంత కష్టపడి చదివితే 'మెయిన్స్' వస్తుందో రాదో! ఒకవేళ మెయిన్స్ దాటినా, ఇంటర్వ్యూలో అన్నీ రాజకీయాలేనట అసలు నేను ఇవన్నీ ఎదుర్కోగలనా? దీనికంటే ఏదైనా చిన్న ఉద్యోగం చూసుకుంటే చాలు. ఈ చదవడం నా వల్ల కాదు! నాన్నకు చెప్పేస్తా!

తండ్రి : ఏమయ్యిందిరా శ్యాం ?

శ్యాం : ఈ చదవడం నాతో కాదు నాన్నా! ఇంత కష్టపడ్డా! ఆ ఐ.ఏ.ఎస్. వస్తుందన్న గ్యారంటీ లేదు! ఎన్ని సంవత్సరాలు వృథా చేయాలి?

తండ్రి : అయ్యో! అట్ల మధ్యలో వదిలేస్తే ఎట్ల రా! నా ఆశయం నెరవేర్చే వాళ్ళే లేరా!

కూతురు: నాన్నా! నేను చదువుతా నాన్నా!

తండ్రి : వాళ్ళిద్దరి వల్ల కాలేదు నువ్వు ఎలా చదువుతావు! అసలే ఆడపిల్లవు?

రాము : చెల్లెమ్మా! ఐ.ఎ.ఎస్. అంటే అంట్లు తోమడం కాదు.

శ్యాం : ఏవైనా కుట్లు అల్లికలుంటే నేర్చుకో! పో!

కూతురు: మీరేమీ! నన్ను ఆడపిల్ల అని గేలి చేయవద్దు. ఎట్లాగో పుస్తకాలున్నాయి. నా డిగ్రీ కూడా అయిపోయింది. ప్రయత్నిస్తే తప్పేముంది?

అన్నయ్యలు (ఇద్దరు) : కొంపదీసి, చదువుతవా ఏంటీ! మాతోనే కాలేదు! సరే! చూద్దాం!

కూతురు : నాన్నా! నేను హాస్టల్లో వుండి చదువుతా!

తండ్రి : సరేనమ్మా! నీ ఇష్టం! హాస్టల్ ఫీజు తీసుకెళ్ళమ్మా! ప్రయత్నించు...

కూతురు : సరే! నాన్నా! థ్యాంక్యూ!

### 4వ దృశ్యం

తండ్రి : రెండు సంవత్సరాలైంది! అమ్మాయి నుంచి ఏం సమాచారం లేదు! ఎలా వుందో ఏమో? ఆ... అదిగో వస్తున్నది!

అమ్మాయి: నాన్నా! మీకు శుభవార్త! ఇదిగో ఈ స్వీటు తీసుకోండి.

తండ్రి : దేనికి తల్లీ!

అమ్మాయి: నాకు ఉద్యోగం వచ్చింది నాన్నా!

రాం : ఏం ఉద్యోగం? కండక్టరా? డ్రైవరా?

శ్యాం : క్లర్కా అటెండరా?

అమ్మాయి: అవేమీ కావు! అన్నయ్యలూ! కలెక్టరుగా నేను ఎంపికయ్యాను

నాటిక

రాం : కలెక్టరా! ఏం జోక్ లేస్తున్నావా!

శ్యాం : ఇంకానయం! సీ.యం! అన్లేదు!

తండ్రి : మీరాగండ్రా! నువ్వు చెప్పు తల్లీ! నాకు చాలా సంతోషంగా వుంది.

అమ్మాయి: అవును నాన్నా! మన యింట్లోంచి వెళ్ళాక చాలా కష్టపడి చదివి ప్రిలిమ్స్ పాసయ్యాను. ప్రణాళికాబద్ధంగా మీరు యిచ్చిన పుస్తకాలను రోజుకు 16 గంటలు చదివి.. మెయిన్స్కు సెలెక్ట్ అయ్యాను. ఇంటర్వ్యూలో కూడా ఆత్మవిశ్వాసంతో సమాధానాలు చెప్పాను. 'ఆడపిల్లవు' రేపు కలెక్టర్ ఉద్యోగం వస్తే ఎలా చేస్తావు! అని అడిగితే... 'మగవాళ్ళు' ఎలా చేయగలరో అలాగే' అని చెప్పాను. నన్ను ఎంపిక చేసారు. ఇంకో సంతోషం కల్గించే విషయం ఏమిటంటే నాకు మన పక్క జిల్లా కలెక్టరుగానే పోస్టింగ్ యిచ్చారు.

తండ్రి : ఎంత శుభవార్త చెప్పావు తల్లీ! ఆడపిల్లవని నిన్ను తక్కువ అంచనా వేసినందుకు, నేను చాలా బాధ పడ్తున్నానమ్మా!

రాం,శ్యాం: సారీ! చెల్లెమ్మా!

కూతురు : పర్లేదు లేండి!

తండ్రి : నీ విజయం ఆడపిల్లలందరికీ స్ఫూర్తిగా నిలవాలి! ఈ జిల్లా కలెక్టరుగా, ఈ సమాజానికి ముఖ్యంగా తల్లిదండ్రులకు నీ 'సందేశం' చెప్పు తల్లీ!




కూతురు : సందేశం అని కాదు గానీ! మగ పిల్లలయిన ఆడ పిల్లలయినా అవకాశాలు యిద్దరికీ సమానంగా యివ్వాలి! వివక్షత చూపరాదు! ఆడపిల్లలూ! మీరు కూడా మేం తక్కువ అని అనుకోకుండా ఆత్మవిశ్వాసంతో చదవండి! జీవితంలో ఏదైనా సాధించాలి అని సంకల్పం చేసుకోండి. ప్రయత్నిస్తే, కష్టపడితే సాధించలేనిది ఏదీలేదు! చదవండీ... ఎదగండీ....

(ఈ నాటిక ఎస్సీఇఆర్‌టి వారి రాష్ట్ర స్థాయి రోల్లో నాటిక పోటీలో పాల్గొని హైదరాబాద్‌లో ప్రదర్శింపబడింది.)

– డా॥ కాసర్ల నరేశ్‌రావు
m : 94414 06252

బొమ్మలు : కైరంకొండ బాబు

## ఉపాధ్యాయులకు విజ్ఞప్తి




బాల చెలిమిలో గత ఐదు నెలలుగా పిల్లల నాటికలను ప్రచురిస్తున్నాం ఇక ముందు కూడా ప్రచురించే ప్రయత్నం చేస్తాం. నాటికలు దృశ్య రూపాలు మీ పాఠశాల విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ప్రదర్శన ఇప్పించండి. ప్రదర్శన వివరాలు, దర్శకత్వం, ప్రదర్శన ఫోటోలు, నటీనటుల పేర్లు, ఫోటోలు పంపితే బాల చెలిమిలో ప్రచురిస్తాం. సాహిత్య రంగంలో మీరిస్తున్న ప్రోత్సాహం దృశ్య రంగంలో కూడా ఇచ్చి పిల్లల్లోని నటనా సామర్థ్యానికి మెరుగులు దిద్దవలసిందిగా కోరుతున్నాం.

– బాలచెలిమి డెస్క్

కథ

# నిజమైన స్నేహితులు



ఇద్దరు స్నేహితులు సెలవు రోజు ఊరు వెలుపలకి షికారుకెళ్లారు. తోవలో మాట్లాడుకుంటూ ఏదో విషయమై అభిప్రాయం కుదరక ఇద్దరూ వాదించుకున్నారు. వాదన ఎక్కువై మొదటివాడు రెండోవాడిని చెంపపై కొట్టాడు. దెబ్బతిన్నవాడు అక్కడున్న ఇసుకపై ‘ ఈ రోజు నా స్నేహితుడు నా చెంపపై కొట్టాడు’ అని రాశాడు.

మళ్లీ ఇద్దరూ ముందుకు నడిచారు. మరికొంత దూరం వెళ్లాక ఇద్దరికి దాహం వేసి, ఓ మడుగు దగ్గరకు వెళ్లారు. చెంప దెబ్బతిన్న మిత్రుడు ముందు నీళ్ళలోకి దిగగా అక్కడ ఊబి ఉంది. అతడు ఊబిలోకి కూరుకుపోతుండగా వెంటనే ప్యాంటు విప్పి మిత్రుడికి దాన్ని అందించి బయటకు లాగాడు, మొదటి మిత్రుడు.

బయటపడ్డాక రెండో వాడు, ఓ బండరాయిపై ‘ఈరోజు నా మిత్రుడు నన్ను ప్రమాదం నుంచి రక్షించాడు’ అని చెక్కాడు. మొదటి విషయాన్ని ఇసుకపై, రెండోదాన్ని రాయిపై ఎందుకు రాశావని మిత్రుడు అడగ్గా, ‘ఇసుక మీద ఏదైనా రాస్తే గాలి వచ్చి కాసేపటికి చెరిగి పోతుంది. స్నేహితులు పొరపాట్లను మనసులో నిలుపుకోకూడదు. కనుక అలా రాశాను. అదే ఉపకారం చేసినపుడు శాశ్వతంగా గుర్తుంచుకోవాలి. అందుకే రాయిపై రాశాను’ అని చెప్పాడు. స్నేహితులే కాదు, ఎవరు తప్పు చేసినా క్షమించి మరచిపోవాలి. వారు చేసిన సహాయాన్ని మాత్రం కలకాలం గుర్తుంచుకోవాలి.

ఎం. రిత్విక
6వ తరగతి,
తేజస్వి ఉన్నత పాఠశాల, నయీంనగర్, హన్మకొండ.

## కవిత

# పాల బుగ్గలు-పూల మొగ్గలు



పసివారి పాల బుగ్గలు
పసందైన పూల మొగ్గలు
ముద్ద మందారం వోలె
ముద్దులొలుకే అధరములు

నిండు జాబిలిలా కన్నులు
తామరాకులా మేనులు
ముగ్ధమనోహరం బాలలు
ప్రకాశించే భానులు

లేగల్లా గంతులేయు
తీగల్లా పెనవేయు
పిల్లలతో అనుబంధము
తరిగిపోని ఆనందము

పిల్లల ముఖారవిందములు
మల్లెల వన్నెల సుమములు
చిందించే చిరు నవ్వులు
సదన క్షేత్రాన ప్రమిదలు


ఇంటి కోవెలలో పిల్లలు
జీవమున్న ఇలవేల్పులు
నట్టింట నడయాడితే
దీవెనలు కోకొల్లలు

నిగనిగలాడే చెంపలు
ధగధగ మెరిసే చూపులు
చిన్నారులు సదనంలో
తారకలే గగనంలో

– గద్వాల సోమన్న
ఎమ్మిగనూరు, కర్నూలు
m : 9966414580

## పంచతంత్ర కథలు

# నక్క-మాట్లాడే గుహ



ఒకానొక అడవిలో ఒక సింహం ఉంది. ఒక రోజు అది ఎంత తిరిగినా కొంచెం కూడా ఆహారం సంపాదించ లేకపోయింది. తిరిగి తిరిగి అలిసి పోయింది. అప్పుడు ఒక గుహను చూసింది. దానిలోకి వెళ్ళి విశ్రాంతి తీసుకుంటోంది.

ఆ గుహ ఒక నక్కది. ఆ నక్క అడవిలో వేటాడి సాయంత్రానికి తిరిగి గుహకు వచ్చింది. కాని గుహ మొదట్లో దానికి సింహం యొక్క అడుగుజాడలు కనిపించాయి. అది గుహలోకి వెళ్ళాయి కానీ తిరిగి బయటకు రాలేదు. ఆ నక్క వాటిని చూసి భయపడింది. గుహలో సింహం ఉందని అర్థం చేసుకుంది. వెంటనే దానికి ఒక ఉపాయం తోచింది. అది గుహతో మాట్లాడుతున్నట్టుగా ఇలా అంది. "ఏమండీ, గుహగారు! బాగున్నారా!" అని పలకరించింది. లోపల ఉన్న సింహం వింది. "రోజూ ఈ గుహ నక్కతో మాట్లాడుతుంది కాబోలు!" అనుకుంది. ఇంతలో నక్క మళ్ళీ ఇలా అంది. "ఏమండీ! గుహగారూ! ఏమిటి మీరు మాట్లాడడం లేదు. నా మీద కోపం వచ్చిందా? మీరు సమాధానం చెప్పకపోతే నేను వేరే చోటికి వెళ్ళిపోతాను లెండి!" అంది. ఆకలితో ఉన్న ఆ తెలివితక్కువ సింహం, "నేను గొంతు మార్చి గుహలాగా మాట్లాడతాను. అప్పుడు నక్క లోపలికి వస్తుంది. నేను దాన్ని చంపి హాయిగా తింటాను" అనుకుంది. సింహం గుహలాగా మాట్లాడటం మొదలు పెట్టింది. వెంటనే గుహలో సింహం ఉందని గ్రహించి నక్క పారిపోయింది.

**నీతి : ఉపాయంతో అపాయం నుంచి తప్పించుకోవచ్చు.**

సేకరణ : అమరావతి

పారాలింపిక్స్

# పారిస్ పారాలింపిక్స్‌లో సత్తాచాటిన పారా ఆర్చర్
# శీతల్ దేవి




ప్రతిష్టాత్మక పారిస్ పారాలింపిక్స్‌లో భారత్ శుభారంభం. పారా అథ్లెట్లు విభాగాల్లో పారా ఆర్చర్ శీతల్‌దేవి ఎక్కడా తడబాటుకు లోను కాకుండా అంచనాలకు మించి రాణించింది. మహిళల వ్యక్తిగత కాంపౌండ్ ఓపెన్ ర్యాంకింగ్ రౌండ్‌లో శీతల్‌దేవి 703 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. ఆమె తన అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేయడంతో పాటు 700 పాయింట్లు దాటిన భారత తొలి మహిళా పారా ఆర్చర్‌గా ఘనత సాధించి కొత్త ప్రపంచ రికార్డును సృష్టించింది. కశ్మీర్‌కు చెందిన 17 ఏళ్ళ శీతల్‌కు పుట్టుకతోనే 'ఫొకెమెలియా సింట్రోమ్' వ్యాధి బారిన పడటంతో ఆమె రెండు చేతులూ పని చేయకుండా పోయాయి. ఆమె కాలివేళ్లతో బాణాన్ని గురి తప్పకుండా సంధించడంలో ఆమె దిట్ట. పతకం ఆశలతో వెళ్లిన పారా ఆర్చర్ శీతల్ దేవి అద్భుతమైన గురితో ఆకట్టుకుంది. టర్కీ ఆర్చర్ ఒజ్నూర్ గిరిడి కుర్ 704 (ప్రపంచ రికార్డు) మొదటి స్థానంలో నిలిచింది. రెండో స్థానంలో నిలువడం ద్వారా శీతల్ దేవి రౌండ్–16కు అర్హత సాధించింది. ప్రీక్వార్టర్స్‌లో రౌండ్–32 విజేతతో శీతల్ తలపడనుంది. గత ఏడాది జరిగిన ఆసియా క్రీడల్లో శీతల్ దేవి 2 స్వర్ణాలు, ఒక రజతం గెలుచుకుంది. ఆ తర్వాత పారా వరల్డ్ చాంపియన్‌షిప్ లో కూడా పతకం సాధించింది.


మిక్స్‌డ్ టీమ్ కాంపౌండ్ ఈవెంట్‌లో శీతల్‌దేవి, ఆర్ కుమార్ ద్వయం ప్రపంచ రికార్డు (1399) స్కోరుతో అగ్రస్థానాన్ని సొంతం చేసుకున్నారు.

– బాలచెలిమి డెస్క్
m : 8686664949

# అద్దె అమ్మ!

రచన : చొక్కాపు వెంకటరమణ, m : 9246520050
బొమ్మలు : టి. గంగాధర్, m :7702037198
ఏప్రిల్, 1991, బాలచెలిమి మాసపత్రిక నుండి...




అమ్మా! మీ అబ్బాయి చదువులో చాలా వెనుక పడ్డాడు. అన్ని పరీక్షల్లోనూ సున్నాలే! స్కూలులో మాకే కాకుండా ఇంటి దగ్గర మీకూ అంతే బాధ్యత ఉంది.
పిల్లల భవిష్యత్తు తల్లిదండ్రుల మీద కూడా ఆధారపడి ఉంటుందని మీరూ తెలుసుకోవాలి. లేకపోతే పిల్లలు ఎందుకూ పనికి రాకుండా పోతారు.
చెప్పిన మాట వినకుండా తిరిగే పిల్లలు తల్లిదండ్రులకే కాదు. మేస్టార్లకూ బరువే! ఈ విషయం చెపుదామనే మిమ్మల్ని రమ్మన్నాను.
అదంతా విన్న కాంతమ్మ సూరిని జుట్టు పట్టుకు లాగి, చెంపల మీద ఎడా పెడా వాయించింది.
ఛెళ్! ఛెళ్!
మేస్టారు బాబూ! ఇంతకంటే ఎక్కువ దండించలేను. వీడిని దారిలో పెట్టటానికి మీరేం చేసినా నాకు అభ్యంతరం లేదు. మీ ఇష్టం.
కాంతమ్మా నేనేం చెప్పాను నీవేం చేస్తున్నావ్?
కాంతమ్మను కాబట్టే ఇంతటితో వదిలాను. అదే మీ అమ్మ అయితే నీ చర్మం వలిచేది. బాగా చదువుకొని బాగు పడు...
నా కొడుకుని ముద్దు చేసి చెడగొట్టాను. వాడు నాకు కాకుండా పోయాడు. ఇంకో అమ్మ కొడుకు అలా కాకూడదనే ఇలా చేశాను. మాట తప్పినా మంచి పనే చేశానని అనుకుంటున్నాను వస్తాను.
తల్లిదండ్రులు, గురువులు క్రమశిక్షణ గుర్తులు
బాలల భవిత తీర్చిదిద్దు సమానమౌకర్తలు
బుద్ధి కలిగి మెలిగితే మేలు నీకు కలుగును
అడ్డదార్లు తొక్కితే ఎదురు దెబ్బ తగులును
సమాప్తం

# ఆడ పిల్ల - ఈడ పిల్ల



ఆడ పిల్ల - ఈడ పిల్ల
ఇంటిలోన - పిల్లి పిల్ల
చూరులోన - ఎలుక పిల్ల
దొడ్డిలోన - మేక పిల్ల
సందులోన - కుక్క పిల్ల
ఏటిలోన - చేప పిల్ల
చెరువులోన - బాతు పిల్ల
చెట్టు మీద - గువ్వ పిల్ల
అడవిలోన - నెమలి పిల్ల
గోడ మీద - బల్లి పిల్ల
కొమ్మ మీద - ఉడుత పిల్ల

ఆకు మీద - తేలు పిల్ల
ముట్టుకుంటే - కుట్టు మల్ల
పట్టుకుంటే - పాము మల్ల...!
ఖబర్దార్.. పీచేముడ్.. హట్
హట్ హట్... చల్ హట్...!

(ఉయ్యాలో జంపాలో బుజ్జి పాటలు నుండి)

- గంగదేవు యాదయ్య
m : 9059112105

# ఐదు పాట!

ఏనుగు తొండము - ఒకటి
మనిషికి కళ్ళు - రెండు
జండా రంగులు - మూడు
కుక్కకు కాళ్ళు - నాలుగు
చేతికి వేళ్ళు - ఐదు



# బంగారు బొమ్మ



ఒకటి రెండు ఒప్పుల కుప్ప
మూడు నాలుగు ముద్దుల గుమ్మ
ఐదు ఆరు అందాల బరిణే
ఏడు ఎనిమిది వయ్యారి భామ
తొమ్మిది పది బంగారు బొమ్మ

- పిల్లల పాటల పరిమళం
తెలంగాణ సారస్వత పరిషత్తు

కథ

# వింత టోపి



అనగనగా ఒక ఊరిలో 'గుగుడ్సె' అనే చిన్న పిల్లవాడు వుండేవాడు. వాళ్ళకు గొర్రెల మంద వుండేది.

అది చలికాలం. గుగుడ్సె వాళ్ళ నాన్న ఓ టోపి తయారు చేసి పిల్లవాడికి బహుమతిగా ఇచ్చాడు. అది గొర్రె బొచ్చుతో తయారు చేసిన మేలు జాతి టోపి.

గుగుడ్సె ఆనందంగా టోపిని తన తలపై పెట్టుకున్నాడు. గుగుడ్సె తల చిన్నది. టోపియేమో పెద్దది. తల నుండి టోపి జారి పిల్లవాడి కళ్ళ మీద పడేది.

"నాన్నా! ఈ టోపి జారి నా కళ్ళ మీద పడుతుంది" అన్నాడు పిల్లవాడు.

"అయితే దానిని చేత్తో పైకెత్తి పట్టుకో" సమాధానం చెప్పాడు నాన్న.

"అంతేనా!" అన్నాడు గుగుడ్సె. తరువాత రోజు తెల్లవారగట్లనే నిద్రలేచాడు పిల్లవాడు. మేకలకు, గొర్రలకు మేత తినిపించి నీళ్ళు తాగించాడు. ఓ గొర్రెపై ఎక్కి ఆడుకుంటున్నాడు.

ఇంతలో వాళ్ళ నాన్న నిద్ర లేచాడు.

గొర్రెపై ఆడుకుంటున్న గుగుడ్సెని చూశాడు. 'శుభోదయం గుగుడ్సె' అన్నాడు నాన్న.

'శుభోదయం నాన్న' అన్నాడు పిల్లవాడు.

తండ్రి చేతిలో వున్న పశువుల దాణాను చూసి, గుగుడ్సె ఇలా అన్నాడు. "నాన్నా! ఈరోజు నేను గొర్రెల మందకు మేత తినిపించి, నీళ్ళు తాగించాను. మీరు తెచ్చిన దాణాను వెనక్కు తీసుకువెళ్ళండి".

నాన్న చిరునవ్వు నవ్వి, పిల్లవాడి భుజం తట్టి మెచ్చుకున్నాడు. ఆ రోజు నుండి గొర్రెల మంద బాగోగులు పిల్లవాడే చూసుకునేవాడు. గొర్రెలు కూడా పిల్లవాడికి బాగా మచ్చికయ్యాయి. అవి పిల్లవాడితో సరదాగా ఆటలాడేవి.

రోజు రోజుకి మంచు కురవడం ఎక్కువయ్యింది. చలి విపరీతంగా పెరిగిపోయింది. పిల్లవాడు మంచుపై కాలు మోపిన ప్రతిసారీ, వయోలిన్ వాయించినపుడు వచ్చే సంగీతంలాంటి శబ్దం వచ్చేది.

ఒక రోజు గుగుడ్సె నడుచుకుంటూ బడికి

వెళ్తున్నాడు. దారిలో వాళ్ళ బడిలో చదివే చిన్న పాప చలికి వణుకుతూ కనిపించింది. ఆమె తన పుస్తకాలను చేతిలో పట్టుకొని వుంది.

పిల్లవాడికి మెరుపులాంటి ఆలోచన వచ్చింది. "నా టోపి ఆ పాపకు ఇస్తే, తను పుస్తకాలను టోపిలో పెట్టి, టోపిని తలపై పెట్టుకోవచ్చు కదా!" అనుకున్నాడు.

చిన్న పాప వద్దకు వెళ్ళి ఇలా అడిగాడు "చలిగా వుందా?" "అవును" అంది పాప.

"నా టోపి తీసుకో!" అన్నాడు పిల్లవాడు.

"వద్దు గుగుడ్సె, టోపీ లేకుంటే నువ్వు చలికి గడ్డ కట్టుకుపోతావు!" అంది పాప.

పిల్లవాడు కోపంతో, టోపిని మంచులోకి విసిరేశాడు. పిల్లవాడు పాప కొన్ని అడుగులు నడిచారు. వెనక్కి తిరిగి చూశారు.

టోపి దిగులుగా గుగుడ్సె వంక చూసింది. ఆశ్చర్యం, వున్నట్టుండి టోపి తనంతట తానే మంచులో నుండి లేచి నిలబడింది. టోపి పరిమాణం పెరగడం ప్రారంభమైంది. ఇది చూసి పిల్లవాడు, పాప ఆశ్చర్యపోయారు.

గుగుడ్సె వెళ్ళి టోపిని తీసుకున్నాడు. దాన్ని తన తలమీద, పాప తలమీద వుంచాడు. అది ఇద్దరికీ చక్కగా సరిపోయింది. కబుర్లు చెప్పుకుంటూ పాఠశాలకు నడిచి వెళ్ళారు. అలా ఆ వింత టోపి గుగుడ్సెనీ, చిన్న పాపను చలి నుండి కాపాడింది.

ఆ రోజు నుండి గుగుడ్సె తన టోపి కింద తన స్నేహితులను తీసుకువెళ్తూ చలి నుండి రక్షించేవాడు. ఓ రోజైతే, ఏడు లేదా ఎనిమిది మంది అమ్మాయిలను తన వింత టోపి కింద, వాళ్ళ ఇళ్ళ దగ్గర దింపాడు.

మరో రోజు తన తరగతి ఉపాధ్యాయురాలికి వింత టోపితో సాయం చేశాడు. అదేం విచిత్రమో! జనాల సంఖ్యని బట్టి టోపి పెద్దదయ్యేది. చలి నుండి కాపాడేది.

గుగుడ్సె ఇంటికి చేరగానే, టోపి చిన్నగా అయ్యి చక్కగా గదిలో అమరేది. ఇలా టోపి సందర్భాన్ని బట్టి పెద్దదవడం, చిన్నగా మారడం చూసి ఊరి ప్రజలు గుగుడ్సె గొప్పతనాన్ని పొగిడేవారు.

ఓ రోజు టోపి పెద్దదవడం మానేసింది. గుగుడ్సె టోపిని ఆజ్ఞాపించాడు, బ్రతిమిలాడాడు, ప్రార్థించాడు. కానీ ఏం లాభం! టోపి కొంచెం కూడా పెద్దదవలేదు.

ఆ రోజు గుగుడ్సె చలిలోనే పాఠశాలకు వెళ్ళి వచ్చాడు. ఉన్నట్టుండి గుగుడ్సెకు ఓ విషయం గుర్తొచ్చింది. ఆ రోజు ప్రొద్దున, తను గొర్రెల మందకు దాణా తినిపించలేదు, నీళ్ళు తాగించలేదు. తన మతిమరుపుతనానికి చింతించాడు.

ఆ క్షణమే గొర్రెల మందకు పచ్చటి గడ్డిని తినిపించి, నీళ్ళు తాగించాడు. తన గదిలోకి తిరిగి వచ్చి చూసేసరికి, ఆశ్చర్యం! టోపి పెద్దదయ్యింది. వింత టోపి గుగుడ్సె మాటని చక్కగా వినింది. పిల్లవాడి ఆజ్ఞను పాటించింది.

ఒకరోజు పిల్లవాడికి ఓ ఆలోచన వచ్చింది. తన వింత టోపితో ఊరి జనాల్ని వాళ్ళ ఇళ్ళని, చలిబారి నుండి కాపాడితే ఎలా వుంటుంది అని. ఆలోచన వచ్చిందే తడవుగా గుగుడ్సె తమ ఇరుగు పొరుగు వాళ్ల గొర్రెల మందకు గడ్డి తినిపించి నీళ్ళు తాగించేవాడు. మెల్ల మెల్లగా వింత టోపి పెద్దదవడం ప్రారంభమైంది. వింత టోపి ఎంత పెద్దదయిందంటే, అది ఊరి మొత్తాన్ని పెద్ద గొడుగులా కప్పేసింది. చలి నుండి కాపాడింది. ఊరి ప్రజలంతా గుగుడ్సెని ఎంతో మెచ్చుకున్నారు. గుగుడ్సెకు, వింత టోపికి కృతజ్ఞతలు చెప్పారు.

చలికాలం ముగిసి, వసంత కాలం వచ్చింది. గుగుడ్సే టోపిని చిన్నగా మారమని అడిగాడు. పిల్లవాడి కోరికను టోపి వెంటనే మన్నించి, చిన్నగా అయిపోయింది. పిల్లవాడు చక్కగా దానిని తలపై పెట్టుకొని గొర్రెల బాగోగులు చూస్తూ, వాటితో ఆడుకొనేవాడు. బుద్ధిగా బడికి వెళ్ళి చక్కగా చదువుకునేవాడు. ప్రతి సంవత్సరం, చలికాలం వింత టోపి గుగుడ్సేని, వాళ్ళ ఊరిని చలిబారి నుండి కాపాడేది. ఇప్పటికీ కాపాడుతోంది..!

**స్వేచ్ఛానువాదం : అనిల్ బత్తుల**
m : 8179273974

ఇంగ్లీష్ : గుగుడ్సెస్ హాట్
రైటర్ : స్పిరిడాన్ వెంగిలి,
ఇంగ్లీష్ అనువాదం : జేమ్స్ రియోర్డన్
బొమ్మ : విక్టర్ దువిడవ్
రష్యన్ జానపద కథల నుండి

# మఱ్ఱి చెట్టు



బాలలూ బాగున్నారా.. ఆగస్టు సంచికలో చింత చెట్టు గురించి తెలుసుకున్నాం కదా.. ఈ సెప్టెంబర్ బాలచెలిమి సంచికలో "జాతీయ వృక్షం" గా పేరు గాంచిన "మఱ్ఱి చెట్టు" గురించి తెలుసుకుందామా!.

పవిత్రమైన, ప్రశాంతమైన, ఆధ్యాత్మికత కలిగిన భారీ వృక్షాలలో మఱ్రి చెట్టు అతి ముఖ్యమైనది. దీన్ని ఆంగ్లంలో "బనియన్ ట్రీ" అంటారు. మన తెలుగు రాష్ట్రాలతో పాటు, ఇండియా, అమెరికా మలేషియా వంటి ఎన్నో దేశాల్లో సాధారణంగా కనిపించే అతి భారీ వృక్షం. మామూలుగా మఱ్రిచెట్టు అనగానే ప్రకృతి రమణీయత గుర్తుకొస్తది. ఒకప్పుడు తెలంగాణలోని ప్రతి పల్లెలో, ప్రతి బావుల పొంటి మఱ్రిచెట్టు లేకుండా ఉండేది కాదు. ఆయుర్వేదంలో మఱ్రిచెట్టు అనేక వ్యాధుల, అంటురోగాల చికిత్స కోసం ఉపయోగపడేదని చెప్పబడింది. అతి సూక్ష్మంగా ఉండే మఱ్ఱి గింజ భూమిలో పడితే మొక్కగా మారి అనతి కాలంలోనే శాఖోప శాఖలుగా విస్తరిస్తుంది. మఱ్రిచెట్టు ఊడలు భూమిలోనికి వెళ్లి కాండముగా పాతుకుని పోయి చెట్టుకు ఆధారంగా నిలుస్తాయి. కొంతకాలం పిదప తల్లి కాండం ఎక్కడ ఉందో గుర్తించలేనంతగా ఉంటుంది. ఉదాహరణకు 700 సంవత్సరాల చరిత్ర కలిగిన పిల్లలమఱ్రి ప్రపంచంలోనే అతి పెద్ద భారీ వృక్షం.

**మఱ్రిచెట్టు ప్రయోజనాలు :**

మఱ్రిచెట్టు ఆకులు పచ్చగా ఉండి మనసుకు ఆహ్లాదపరుస్తాయి. దీని ఆకులు తెంపి ఎండబెట్టి విస్తరాకులు తయారు చేసేవారు. పచ్చటి ఆకులలో కూడా వనభోజనం చేసేవారు. తింటే ఎంతో తృప్తి.

* వెనకటి కాలంలో ప్రతి ఒక్కరి వ్యవసాయ బావి దగ్గర రాగిచెట్టో, మఱ్రిచెట్టో, వేప చెట్టో, చింత చెట్టో ఏదో ఒకటి కచ్చితంగా ఉండేది.
* పెళ్లిళ్లకు, పశువుల కొట్టాలకు మఱ్రి చెట్టు యొక్క వాసాలు ఉపయోగించేవారు. మఱ్రిచెట్టు అనేక జంతువులకు, పశుపక్షాదులకు నివాసాలుగా ఉపయోగపడేవి.
* మఱ్రి ఊడలను ఆయుర్వేద మందుల తయారీలో వాడేవారు.
* జీర్ణ వ్యవస్థ కోసం, చర్మ సంరక్షణ కోసం, మధుమేహ వ్యాధి నివారణ కోసం,మెదడు పరిశు ద్దత కోసం, కొలెస్ట్రాల్ తగ్గించడం కోసం మరి చెట్టు ఎంతగానో ఉపయోగపడుతుంది.
* మఱ్రి ఆకులలో ఉండే అధిక ఫైబర్ కంటెంట్ మలబద్ధకాన్ని తగ్గిస్తుంది.
* కీళ్ల నొప్పుల నివారణలో కూడా ఈ వృక్షం ఎంతగానో ఉపయోగపడుతుంది.

ఇంకా ఎన్నో ఉపయోగాలు కలిగిన ఈ భారీ వట వృక్షం నేటికి తెరమరుగయ్యిందని చెప్పవచ్చు. పూర్వ కాలంలో రాజులు నాటిన మఱ్రి చెట్లు నేటికీ అక్కడక్కడ మనం గమనించవచ్చు. శ్రీకృష్ణ భగవానుడు మఱ్రి ఆకు మీదనే విశ్రాంతి తీసుకోవడం వల్ల ఆయనను "వటపత్రశాయిగా" పిలువబడ్డాడు. ఇదంతా చూశారుగా బాలలూ! ఇక మనం కూడా అంతరించిపోతున్న మఱ్రి చెట్టు జాతిని కాపాడటమే కాకుండా, జీవితకాలంలో ఒక్కటైనా మఱ్ఱి చెట్టు మొక్క నాటి పర్యావరణాన్ని కాపాడుదాం.

– కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి
m : 9441561655



# పులి పిల్లల మంచి మనసు

అడవిలో పరుగెడుతున్న తన తల్లిని అనుసరిస్తూ తప్పిపోయింది ఓ జింక పిల్ల. తల్లి కనిపించకపోయేసరికి అటూ ఇటూ చూసి దిగాలుగా కూర్చుంది. తన పిల్లను గమనించకుండా తల్లి వెళ్తూనే ఉంది.

ఇంతలో అటుగా వెళ్తున్న పెద్దపులి జింకపిల్లను చూడనే చూసింది. 'ఆహా... మంచి భోజనం దొరికింది' అని సంబరపడంది. లేలేత మాంసం భలే రుచిగా ఉంటుందని లొట్టలేసుకుంటూ దానికి ఎదురుగా నిలబడింది. జింకపిల్ల భయపడలేదు, సరికదా... 'మా అమ్మను నువ్వేమైనా చూశావా? మా అమ్మ దగ్గరకు తీసుకెళ్లవా?' అంటూ అమాయకంగా అడిగింది.

ఆ ప్రశ్నతో పులి ఆశ్చర్యపోయింది. 'ఏమిటీ.. ఈ జింక పిల్లకు ఇంత ధైర్యం? ఓహో... నన్నెప్పుడూ చూసి ఉండదు. నేనెవరో దానికి తల్లి చెప్పి ఉండదు' అని పులి తన మనసులో అనుకుంది. 'అయినా, ఇవన్నీ నాకెందుకు.. మంచి భోజనం అయితే దొరికింది. కొంతసేపు దీన్ని ఇలాగే ఉంచితే, పిల్లను వెతుక్కుంటూ తల్లి కూడా ఇక్కడకు వస్తుంది. అప్పుడు దాన్నీ ఆరగించొచ్చు. నా పిల్లలకు కూడా సరిపడా ఆహారం దొరుకుతుంది' అనుకుంది పులి. ఊహించినట్టుగానే తల్లి జింక, తన పిల్లను వెతుక్కుంటూ వచ్చింది. పులి



ఎదుట తన పిల్లను చూడగానే భయపడింది తల్లి.

'ఓ పులీ! దయచేసి నా బిడ్డను వదిలిపెట్టు. లోకం తెలియని అమాయకురాలు అది' అని వేడుకుంది తల్లి. అమ్మను చూడగానే నవ్వుతూ ముందుకు వెళ్లబోయిన జింకపిల్లను తన కాలితో గట్టిగా పట్టుకొని 'ఓ జింకా.. వేటాడటం మా ధర్మం. పాపం పుణ్యం అంటూ ఏమీ ఉండవు. కావాలంటే నీ పిల్లను వదిలేస్తాను. అందుకు బదులుగా నువ్వు నాకు ఆహారం అవడానికి సిద్ధమేనా?' అంది పులి.

కానీ, దగ్గరకు రాగానే పిల్లతో పాటు తల్లినీ తినాలనే ఆలోచన దానిది. ఆ విషయం గ్రహించక సరేనంది తల్లి జింక.

'నువ్వు మాట మీద నిలబడతావనే నమ్మకంతో నీ దగ్గరకు వస్తున్నా' అంటూ పులి వైపు అడుగులు వేసింది తల్లి. ఈ విషయాన్ని మొదటి నుంచి దూరంగా ఉండి గమనిస్తున్న పులి పిల్లలు.. తల్లి దగ్గరకు వచ్చాయి.

తల్లి జింకను చంపిన తర్వాత పిల్లనూ తమ తల్లి తినేస్తుందని వాటికి తెలుసు. అందుకే, 'అమ్మా.. దయచేసి ఈ అమాయక తల్లిజింకను, పిల్ల జింకను ఏమీ అనవద్దు. ఎందుకంటే, మొన్న మేము కూడా ఇలాగే అడవిలో ఒంటరిగా ఉన్నప్పుడూ ఓ తోడేలు మమ్మల్ని చంపడానికి ప్రయత్నించింది. ఈ తల్లి జింకే దాన్ని ఏమార్చి మమ్మల్ని రక్షించింది. ఆ సమయంలో అది రాకపోతే మేం బతికేవారం కాదు. మాకు ప్రాణదానం చేసిన జింకను మేం తినలేము' అని తల్లికి చెప్పాయి పులిపిల్లలు.

పిల్లల మాటలతో పులి ఆలోచనలో పడింది. తన



బిడ్డలను కాపాడిన జింకను చంపడం భావ్యం కాదని నిర్ణయించు కుంది. ‘ ఓ జింకా... నా పిల్లల ప్రాణాలు కాపాడిన నీకు కృతజ్ఞతలు.. మీకు ఎటువంటి హానీ తలపెట్టను. దయచేసి నీ పిల్లను తీసుకెళ్లి సంతోషంగా ఉండు’ అని వదిలేసింది. ఎంతో సంతోషించిన తల్లి జింక.. తన పిల్లను దగ్గరకు తీసుకొని ముద్దాడింది. పులికి దాని పిల్లలకూ కృతజ్ఞతలు చెప్పి, తన పిల్లను తీసుకుని సంతోషంగా ఇంటికి వెళ్లిపోయింది జింక.

అయితే, ఎంత ఆలోచించినా తల్లి జింకకు మాత్రం పులి పిల్లలకు తానుచేసిన సాయం గుర్తుకు రాలేదు.

ఒకరోజు అనుకోకుండా ఆ పులి పిల్లలు ఆడుకుంటూ తల్లి జింకకు కనిపించాయి. వెంటనే వాటి దగ్గరకు వెళ్లి ‘మీరు మా ప్రాణాలు కాపాడారు. అందుకు మరోసారి ధన్యవాదాలు. కానీ, నేను మీకు సాయం చేసిన విషయం నాకు గుర్తుకు రావడం లేదు. ఆ సంఘటన ఎప్పుడు ఎక్కడ జరిగిందో నాకు వివరిస్తారా?’ అని అడిగింది.

అందుకు పులి పిల్లలు నవ్వుతూ.. ‘ఓ జింకా... నువ్వు మాకు సహాయం చేయలేదు. కేవలం మిమ్మల్ని కాపాడటం కోసమే మేం మా అమ్మకు అబద్ధం చెప్పాం. మాకు ఏమైనా జరిగితే మా అమ్మ ఎంత బాధపడుతుందో మాకు తెలుసు. అలాంటి ఇబ్బంది నువ్వు పడకూడదు అని అనిపించింది. పైగా మా వయసులోనే ఉన్న నీ బిడ్డను చూస్తే జాలి కలిగింది. మా అబద్ధం వల్ల మీ ప్రాణాలు నిలబడినందుకు మాకు ఎంతో సంతోషంగా ఉంది’ అని వివరించాయి. పులి పిల్లల మంచి మనసుకు తల్లి జింక ముగ్ధురాలైంది. సంతోషంతో దాని ముఖం వెలిగిపోయింది.

పులి పిల్లలకు మరోసారి కృతజ్ఞతలు తెలిపి ఇంటిదారి పట్టింది.

– వడ్డేపల్లి వెంకటేష్
పిల్లల జాబిల్లి పుస్తకం నుండి...
m : 9989596554



కథ

# దయ గల పులి



అనగనగా ఒక అడవిలో భైరవుడు అనే దయగల పులి ఉండేది. అది శాఖహారిగా ఉండేది. అది అందరికి సహాయ పడుతుండేది. వేరే జంతువులను చంపకపోయేది. అందరితో స్నేహంగా మెలిగేది. ఒకరోజు ఆ అడవిలోకి ఒక వేటగాడు వచ్చాడు. ఆ వేటగాడు జింక కోసం వల వేసి ఉన్నాడు. కానీ ఆ దారిన ఒక సింహం, ఆ వేటగాడిని చూసి తన పంజా విసిరింది. అప్పుడు వేటగాడు "కాపాడండి, కాపాడండి" అని అరిచాడు. ఆ కేక విని, అక్కడే ఉన్న భైరవుడు సింహంతో పోరాడింది. తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా, సింహంతో పోరాడి వేటగాడి ప్రాణాలను రక్షించింది. ఆ వేటగాడు పులికి తన కృతజ్ఞతను తెలియజేసాడు.

కొద్ది రోజుల తరువాత, పులి భార్య తనకి జింక మాంసం కావాలని అడిగింది. కాని పులి నిరాకరించింది. తను జీవ హత్య చేయనని చెప్పింది. అప్పుడు ఆ పులి భార్యకు చాలా కోపం వచ్చింది. పులిని చంపాలని పన్నాగం పన్నింది. పులి భార్య అన్ని జంతువులతో, తనని పులి చంపుతుంది అంది. తనను పులి బారి నుండి రక్షించమని అన్ని జంతువులను కోరింది. కాని, పులి భార్య మాటలు ఎవరూ నమ్మలేదు. అప్పుడు పులి భార్య తనే పులిని చంపడానికి సిద్ధపడింది. ఒక రోజు పులి నిద్రిస్తున్న సమయాన, పులి భార్య తన మీదికి పంజా విసిరింది. అప్పుడే అటువైపు వచ్చిన ఆ వేటగాడు ఈ దృశ్యం చూసి తన బాణాలని పులి భార్య కాలిమీద పడేటట్లు ప్రయోగించాడు. కాలికి గాయమైనా ప్రాణానికి హానిలేదు. ఎందుకు బాణ ప్రయోగం చేయాల్సివచ్చిందో వేటగాడు వివరించగా, భార్య పులి క్షమించమని అడుగగా, క్షమించేసాడు భర్త.

'పశ్చాత్తాపానికి మించిన ప్రాయశ్చిత్తం లేదు కదా' అని అన్నాడు వేటగాడు.

**ఆర్ అపూర్వ**
8వ తరగతి,
ట్రినిటి పాఠశాల, మంచిర్యాల జిల్లా





# చంద్రశిలా శోభిత చంద్రవెల్లి గుళ్ళు

తెలంగాణా వాస్తుశిల్ప కళలకు కాణాచి కాకతీయ దేవాలయాలైతే వాటికి మచ్చుతునక రామప్ప దేవాలయం. దాన్ని చాలా మంది చూసుంటారు. శిల్పకళా రామణీయకతలో దానితో పోటిపడే దేవాలయాలు కూడా మన రాష్ట్రంలోనే ఉన్నాయి. ఇవి కరీంనగర్ జిల్లా మంథనికి సమీపంలో ఉన్న కమ్మంపల్లి గ్రామ శివారులో ఉన్నాయి. స్థానికులు వీటిని చంద్రవెల్లి గుళ్ళు (సందరెళ్ళి గుళ్ళు) అంటారు. ఆ గుళ్ళలో దొరికిన శాసనంలో కూడా చంద్రవెల్లి పేర్కొనబడింది. సమీపం నుండి మానేరు నది పారుతూ కంబం వంటి ఒక నిటారైన పెద్ద శిల వద్ద మలుపు తీసుకొని మరో 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న గోదావరి నదిలో కలుస్తుంది. ఈ కంబం ప్రాంతంలో ఉన్న ఊరికే కమ్మంపల్లి అనే పేరొచ్చింది.

ఇక్కడ రెండు దేవాలయాలున్నాయి. వాటి మధ్య దూరం సుమారు 150 మీటర్లుంటుంది. ఈ ఖాళీ స్థలంలో గోధుమ వర్ణపు మంచి రాయి ఉంది. దాన్ని వెలికి తీసి ఆ రాతితో ఈ దేవాలయాలను కట్టారు. కట్టించింది – విశ్వేశ్వర శివాచార్యులు. ఈయన క్రీ.శ.1199 నుండి 1262 మధ్య తెలుగు దేశాన్ని పాలించిన ఓరుగల్లు కాకతీయ రాజు గణపతిదేవునికి గురువు. రోడ్ పక్కనున్న ప్రధాన దేవాలయంలోని మూల విరాట్ పేరు విశ్వేశ్వర స్వామి అని శాసనంలో పేర్కొనబడింది.

ఈ విశ్వేశ్వరాలయం త్రికూటాలయం. అంటే ఒకే విశాలమైన మంటపానికి మూడు వైపులా మూడు ఆలయాలుండడం. ప్రధాన ఆలయం ప్రధాన ద్వారం తూర్పువైపు ఉంది. ఫర్లాంగు దూరంలోనే ఉన్న మానేరు నదిలో భక్తులు, తపోధనులు, బ్రాహ్మణులు అధిక సంఖ్యలో స్నానం చేసి వచ్చి స్వామివారిని అర్చించేవారని, స్వామివారి అంగరంగ భోగాలతోపాటు అలాంటివారి సౌకర్యాల కల్పనకు కూడా విశ్వేశ్వరాచార్యులు దానాలు చేశారని శాసనంలోనే ఉంది.

ఇక్కడి రెండు ఆలయాల గోడలు, పట్టీలు, స్తంభాలు, కప్పులు, ద్వారాలు, ద్వారాలపై కమ్మీలు మొదలుకొని ప్రతి శిల ప్రతి అంగుళం వెన్నపూసలు మలచబడ్డట్లే అనేక రూపలావణ్యాలతో మలచబడ్డాయి. ఆయా శిల్పాల సౌందర్యం చూపరులకు ఒక జీవితకాలపు నేత్ర పర్వాన్ని మిగులుస్తుంది. స్తంభాల కింది భాగంలో చెక్కిన నాట్యకత్తెల శిల్పాలు, పై భాగాల్లో శిల్పించిన హంసలు, చిలుకలు, కీర్తిముఖాలు, ఆలయ ద్వారాలపై చెక్కిన త్రిమూర్తులు తదితర శిల్పఖండాలు రామప్ప శిల్పాలను సైతం సౌందర్యంలో తక్కువ చేస్తాయి. ఇంతటి అందమైన, శిల్పకళా శోభితమైన ఆలయాలను ఇప్పుడు మనం దశాబ్దకాలం పాటు కొన్ని కోట్లు ఖర్చు పెట్టి కృషి చేసినా కట్టలేము కాబట్టి శిథిలావస్థలో ఉన్న వాటిని కొంచెం ఖర్చుతో పునరుద్ధరించుకుంటే మన అద్భుత కళా వారసత్వాన్ని కాపాడుకున్నవాళ్ళమవుతాం.

**ఇలా వెళ్ళాలి:** చంద్రవెల్లి గుళ్ళు హైదరాబాద్‌కు సుమారు 250 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. ఎటు నుంచి వెళ్ళేవారైనా ముందు మంథని చేరుకుని, అక్కడి నుంచి సుమారు 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గుళ్ళకు సొంత వాహనాల్లోగాని, బస్సులు, ఆటోల్లో గాని వెళ్ళవచ్చు. రైలు సౌకర్యం ఈ గుళ్ళకు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెద్దపల్లి / రామగుండం వరకు ఉంది. సమీపంలోని మంథనిలో తిండి, వసతి సౌకర్యాలు లభిస్తాయి. మంథని కూడా చారిత్రక ఆలయాలకు, సమీప గోదావరిలో జరిపే కర్మకాండలకు ప్రసిద్ధి.

– డా. ద్యావనపల్లి సత్యనారాయణ
m : 94909 57078

## చెలిమి క్లబ్

చెలిమిక్లబ్‌లో సభ్యత్వం తీసుకోండి
లాభాలు పొందండి.

1. చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించే పుస్తకాలపై ప్రత్యేక తగ్గింపు.
2. మీ ప్రతి పుట్టిన రోజుకు అభినందనలతో అందమైన గ్రీటింగ్ కార్డు.
3. మీలో ఉన్న టాలెంట్‌ను అభివృద్ధి చేసుకోవడానికి క్లబ్ నిర్మాణాత్మక సహకారం అందిస్తుంది.
4. మీ స్కూల్లో, ఊర్లో పిల్లల కార్యక్రమాల వార్తలను చెలిమి సమాచారపత్రికకు పంపడానికి మీరు విలేఖరిగా ఉండవచ్చు.
5. అందమైన మెంబర్‌షిప్ బ్యాడ్జి.
6. మిమ్మల్ని ఆశ్చర్యపరచే బహుమతులు.

### చెలిమి క్లబ్

మెంబర్ షిప్ నెం. : --------------

పేరు : ---------------------

తండ్రి పేరు : ---------------------

తరగతి : ---------------------

పుట్టినతేదీ : ---------------------

హాబీలు : ---------------------

చిరునామా : ---------------------

---------------------


---------------------

పిన్ : ---------------------

ఇ-మెయిల్ : ---------------------

ఈ వివరాలతో మెయిల్ చేయండి.

బాల చెలిమి ఇ-మెయిల్ :
desk.chelimi@gmail.com



కథ

# కిలకిల నగవుల చిలుకలు



గోధూళి వేళయ్యింది. కొమ్మలన్నీ రెమ్మల గుబురుల్లో విశ్రమించే గువ్వల కోసం ఎదురు చూస్తున్నాయి. ఆకులను దాల్చిన చెట్లన్నీ వాటి వచ్చదనానికి మురుస్తున్నాయి. వాటితో పోటిగా నిలువెల్లా పచ్చదనంతో చిలుకలు బారులు బారులుగా విహరిస్తూ.. ఆకాశానికి వచ్చదనాన్ని అద్దుతున్నాయి. వృద్ధ చిలుకలు ముందే వచ్చి చెట్లపై వాలి.. తమ చిన్న చిలుకల కోసం ఎదురు చూస్తున్నాయి. కాసేపటికి జడి వానలా రెక్కలు టపటపలాడిస్తూ చిలుకలు గూళ్ళు చేరుకున్నాయి.

లాస్య చిలుకా, నేహా చిలుకా విషయం "మేం చెబుతామంటే మేము చెబుతామని" పోటీ పడుతున్నాయి. పెద్ద చిలుకలూ, వృద్ధ చిలుకలూ ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ "ఎవరో ఒకరు చెప్పండర్రా..!" అన్నాయి.

నేహా చిలుక అన్నది. "ఎప్పుడూ సంతోషకరమైన కబుర్లు చెప్పరు.. అంటున్నారు కదా! అందుకే ఇవాళ ఓ మంచి కబురు పట్టుకువచ్చాం."

"రేపు పగలు ఈ వనం ఇలా వుంటుందా! మా మంచి చిన్ని చిన్ని నేస్తాలతో కళకళలాడిపోతుంది!" లాస్య చిలుక గింగిరాలు తిరుగుతూ అన్నది.

"అవును. ఈ చెట్లకింద వారి ఆటలూ, పాటలూ, కేరింతలతో వనానికి కొత్త వన్నెలు వస్తాయి." విద్య చిలుక అన్నది.

"రంగురంగుల దుస్తులు ధరించి పువ్వుల్లా నవ్వుతూ.. మువ్వల్లా కబుర్లాడుతూ.. ఇక వనమంతా సందడే సందడి.." రీతు చిలుక వర్ణించింది.

"ఓహెూ! పిల్లలంతా వన భోజనాలకు వస్తున్నారన్న మాట!" పెద్ద చిలుక అన్నది. అవును మరిక మేము రేపు మొత్తం మా నేస్తాలతో చాలా హాయిగా గడిపేస్తాం."

"అవును రేపు.. ఆ అడవంతా పిల్లల నందనం. ఈ చెట్టునిండా జామకాయలున్నాయిగా అవెలాగు తింటారనుకో! కానీ.. ఆ నేరేడు చెట్లు బోసిగా వుంది. మా నేస్తాలు పాపం ఏం కోసుకుతింటారు?" లాస్య చిలుక అడిగింది.

"అవును. ఇది మామిళ్ళ కాలమూ కాదు. ఉసిరికాయ లేమన్నా దొరుకుతాయేమో!" వారికి నేహా చిలుక అన్నది.

"చింతకాయలు తింటారుగా పుల్లగా!" నీతు చిలుక అన్నది.

"ఉసిరికాయలు చాలానే వున్నాయి.. మామిళ్ళు తినకుంటేనేం? ఆ చెట్లపై ఉయ్యాలలూగుతారు. వేపచెట్లను కొండలనెక్కినట్లు ఎక్కుతారు సరేనా!" చిలుకబామ్మ అన్నది. మద్ది, మర్రి చెట్లెక్కి కోతి కొమ్మచ్చులాడుకుంటారులే!" పెద్ద చిలుక అన్నది.

"ఆ క్రితం సంవత్సరం వన భోజనాలంటూ వచ్చిన జనం చెత్తా చెదారం పేర్చి పొయ్యారు. మా కాలంలో మేమెరుగమమ్మా ఇవ్వన్నీ.. అరిటాకులో భోజనం.. పిడతల్లో నీళ్ళు తాగడం పోయింది. పాడు ప్లాస్టిక్‌లూ, పాలిత్నిన్లూ వచ్చి ఊరంతా పాడు చేసుకుంటున్నారు. వనాలూ పాడు చేస్తున్నారు." చిలుక తాత కస్సుమన్నాడు.

"కుండల్లో పాయసాలు వండి.. ఆకు దొన్నెల్లో వాళ్ళు తింటూంటే.. మాకెంత నోరూరేదని బిందెలతో పానకాలు, కుండెడు మజ్జిగలు.. అవి చాలవన్నట్లు కొబ్బరి బోండాలు లాగించేవారు.." చిలుకబామ్మ గుర్తు చేసింది.

"మరి ఇప్పుడో సీసాల్లో రంగునీళ్ళు.. ప్లాస్టిక్ గ్లాసుల్లో వేడి నీళ్ళు.. ఆరోగ్యాలు బాగుండమంటే ఏం బాగుంటాయి?" చిలుకతాత అన్నాడు.

"నిజమే! పెరుగుట విరుగుట కొరకే అనీ.. ఈ మానవుడు నాగరీకం నేర్చుకుంటున్నాను అనుకుంటున్నాడు గానీ.. వాడకూడని పదార్థాలతో చెత్తా చెదారం పేర్చేసి అనాగరీకుడవుతున్నాడు" పెద్ద చిలుక నిట్టూర్చింది.

"సరే సరే! మీరిలాగే మాట్లాడితే మట్లాడారుగానీ.. మా చిన్న నేస్తాలు వచ్చాక మేం వారి చుట్టే వుంటాం. మీరేదో పని ఉన్నట్లు మమ్ముల్ని పదే పదే పిలవద్దు" నేహా చిలుక హెచ్చరించింది.

"వాళ్ళకి కానిన్ని నీవు చింతకాయల్ని, జామకాయల్ని కొరికి రాల్చాలి. మీరు మాకు కాస్త సాయం చెయ్యండి" లాస్య చిలుక విద్యాచిలుకలు బతిమాలుకున్నాయి.

"అలాగేనర్రా!" అంటూ చిన్న బాలలంటే వీరికెంత ప్రేమో!" నిండుగా నవ్వుకున్నాయి. పెద్ద చిలుకలు వృద్ధ చిలుకలు.

సమ్మెట ఉమాదేవి

m : 98494 06722

## సామెతలు

- కూర్చుని తింటే కొండలయినా కరిగిపోతాయి
- కూసే గాడిదొచ్చి మేసే గాడిదని చెరిపినట్లు
- కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక కాస్తా ఊడిపోయిందట
- కొండంత దూదికి కొండంత నిప్పు ఏల
- కీడించి మేలెంచమన్నారు
- కొండను మింగేవానికి గోపురం ఒక లెక్కా
- ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా
- ఎండిన కట్టెకు నారలు తీసే రకం
- కందకు లేని దురద కత్తిపీటకెందుకు
- కుక్క కాటుకు చెప్పు దెబ్బ

– బాలచెలిమి

# వీరగంధం తెచ్చినారము

వీరగంధము తెచ్చినారము - వీరుడెవ్వడో తెల్పుడీ
పూసిపోదము... మెడను వేతుము పూలదండలు భక్తితో ॥వీర॥

తెలుగు బావుట కన్ను చెదరగ - కొండవీటను ఎగిరినప్పుడు
తెలుగు వారల కత్తిదెబ్బలు - గండికోటను గాచినప్పుడు ॥వీర॥

ఇదిగొ యున్నది వీరగంధము - మేనలందుము... మేనలందుము
శాంతిపర్వము చదువవచ్చును - శాంతి సమరంబైన పిమ్మట ॥వీర॥

తెలుగు నాటను వీరమాతను - జేసి మాత్రము తిరిగి రమ్మిక
పలు తుపాకులు పలు ఫిరంగులు - దారికడ్డము రాకతప్పదు ॥వీర॥


కవిరాజు
త్రిపురనేని రామస్వామి

## కలంచెలిమి


**టి. శైలజ**
8వ తరగతి,
అరవింద హై స్కూల్,
కుంచనపల్లి, గుంటూరు


**కొల్లి చంద్రిక**
9వ తరగతి,
ప్రభుత్వ ఉన్నత పాఠశాల
ఎన్ఎస్‌పి కాలనీ. ఖమ్మం.


**ఆర్. భవిత**
10వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
సిరిసిల్ల.


**వై. మహతి**
9వ తరగతి,
విజయ్ ఉన్నత పాఠశాల,
నిజామాబాద్.


**సృజని**
7వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత
పాఠశాల, కల్లివెట్టు,
బి.ఎన్.కండ్రిగ మండలం, తిరుపతి.


**ఇ.వైష్ణవి**
10వ తరగతి,
నాట్కో జిల్లా పరిషత్ ఉన్నత
పాఠశాల, సిద్దిపేట.

ఆరోగ్యం

# యోగా నేచురోపతిక్ వైద్యం



ఏరా మనవడా ఇంటర్ తర్వాత ఏం చదువాలని అనుకుంటున్నావు.

ఏం లేదు తాతయ్య బివైఎన్ఎస్‌లో జాయిన్ అవుదాం అనుకుంటున్నాను. బివైఎన్ఎస్ అంటే, బ్యాచిలర్ ఆఫ్ యోగా, నేచురోపతిక్ సైన్సెస్ అని అంటారు. ఈ వైద్య విధానంలో మందులకు బదులుగా, వివిధ రకాల ప్రకృతి పరమైన విధానాల ద్వారా రోగాలను నయం చేస్తారు. యోగా, ధ్యానం, వ్యాయామం, పాస్టింగ్ థెరఫీ, ఆహారం, పోషకాలు, మడ్ థెరపీ, హైడ్రో థెరపీ, చిరోప్రాక్టిక్ చికిత్స, ఆస్టియోపతి (బోలు ఎముకల చికిత్స), మానిప్యులెటివ్ థెరపీ, అలాగే ప్రాణయామము వివిధ యోగాసనాల వల్ల కూడా ఎంతో ఆరోగ్యం కలుగుతుందని, ఇది కూడా గొప్ప వ్యాయామమే కదా, కౌన్సిలింగ్ మొదలైన విధానాల ద్వారా చికిత్స చేస్తారు. "చికిత్స కన్నా నివారణ మిన్న" అందుకు మార్గం యోగా చేయడం.

– ఆరోగ్యం – విజ్ఞానం ఆధారంగా...
తెలంగాణ సారస్వత పరిషత్తు, హైదరాబాదు.

శతకం

## వేమన పద్యాలు



చెప్పులోని రాయి చెవిలోని జోరీగ
కంటిలోని నలుసు కాలిముల్లు
ఇంటిలోని పోరు నింతింత కాదయా
విశ్వదాభిరామ వినురవేమ!




బాధలన్నీ ఒక్కమారే కల్గటం లోక సహజం, చెప్పులోని రాయి, చెవిలో జోరిగ, కంటిలో నలుసు, కాలిలో ముల్లు చిన్నవే అయినా వీటి బాధ ఎక్కువే ఇంట్లో పోరు వీటి అన్నింటి కంటే బాధాకరమైంది. ఈ పద్యంలో చూస్తే పైకి అన్ని తెలిసిన పదార్థాలే ఉన్నట్లు కనిపిస్తాయి. కానీ పద్యాన్ని తరిచి చూస్తే అందులో నిగూడార్థం ఉంటుంది.

చిప్పలోనఁబడ్డ చినుకు ముత్యంబాయె
నీళ్ళలోనఁగలిసి నీరె యాయె
ప్రాప్తము గలచోట ఫలమేల దప్పురా
విశ్వదాభిరామ వినురవేమ!

స్వాతి కార్తె యందు వర్షపు బిందువు చిప్పయందు పడినచో ముత్యము అవును. నీటి యందు పడినచా నీటిలో కలిసి పోవును. ప్రాప్తి ఉన్నచో అదృష్టము ఎక్కడికి పోదు.



# పండ్లు







| | పండ్లు | శాస్త్రీయ నామం | తెలుగు పేరు |
|---|---|---|---|
| 1) | Apple | Malus Pumila | ఆపిల్ |
| 2) | Pomegranate | Punica Granatum | దానిమ్మ |
| 3) | Pine Apple | Annus sativus | అనాస (పైనాపిల్) |
| 4) | Orange | Citrus aurantium | నారింజ |
| 5) | Mango | Mangifera indica | మామిడి |
| 6) | Strawberry | Fragaria, ananassa | స్ట్రాబెర్రి |
| 7) | Sweet Potato | Ipomoea batatos | చిలగడదుంప |
| 8) | Watermelon | Citrullus vulgaris | పుచ్చకాయ |
| 9) | Muskmelon | Cucumis melo | కర్బూజ |
| 10) | Banana | Musa paradisiaca | అరటి |
| 11) | Guava | Psidum guajava | జామ |
| 12) | Lemon | Citrus limonium | నిమ్మ |
| 13) | Chiku (Sapota) | Achras sapota | సపోట |
| 14) | Jack fruit | Artocarpus integra | పనస |
| 15) | Grapes | Vitis vinifera | ద్రాక్ష |
| 16) | Olive | Europaea | ఆలివ్ |
| 17) | Cherry | Prunus avium | చెర్రీ |
| 18) | Avocado | Persea americana | అవకాడో |

– 'ఆరోగ్యం – విజ్ఞానం' తెలంగాణ సారస్వత పరిషత్తు నుండి...

పక్షి

# గ్రేట్ గ్రే గుడ్లగూబ



సాధారణ పేరు: గ్రే గ్రే గుడ్లగూబ (Great grey owl)
శాస్త్రీయ నామం: స్ట్రిక్స్ నెబులోసా (Strix nebulosa)
రకం: పక్షి (bird)
ఆహారం: మాంసాహారం (carnivore)
గ్రూప్ పేరు: పార్లమెంట్ (Parliament)
సగటు బరువు: 1.1 కిలోగ్రాములు
రెక్కలు: 1.3 మీటర్లు

గుడ్లగూబలు ఉత్తర అమెరికాలో క్యూబెక్ నుండి పసిఫిక్ తీరం, అలాస్కా వరకు, ఉత్తర ఆసియా అంతటా ఫిన్లాండ్, ఎస్టోనియా వరకు సంతానోత్పత్తి చేస్తాయి. పశ్చిమ యునైటెడ్ స్టేట్స్‌లోని అంతర్గత భాగంలో, వలస లేని గొప్ప బూడిద గుడ్లగూబ ఉంటుంది. గుడ్లగూబ శరీరం యొక్క మిగిలిన భాగం బూడిద-గోధుమ రంగులో ఉండగా, ఈకల డిస్క్ గడ్డం, కళ్ళ దగ్గర తెల్లటి పాచెస్‌తో ప్రకాశవంతమైన బూడిద రంగులో ఉంటుంది. గుడ్లగూబలు చాలా తక్కువ దగ్గరి దృష్టిని కలిగి ఉంటాయి. ముక్కు చుట్టూ క్రెన్స్ అని పిలువబడే సున్నితమైన వినికిడిని కలిగి ఉంటుంది. తరచుగా మంచుతో కూడిన పరిస్థితులు ఉన్నప్పటికీ, వాటి వినికిడి శక్తి చాలా బాగుంది, పక్షులు మంచు కింద అనేక అడుగుల క్రింద ఉన్న ఎలుకల హృదయ స్పందనను గుర్తించగలవు. గుడ్లగూబ ముఖం యొక్క ఈకలు ఈ వినికిడిలో సహాయ పడతాయి, ఫేషియల్ డిస్క్‌ను ఏర్పరచడం ద్వారా, ఈ చెవుల వైపు ఏదైనా శబ్దాన్ని సూచించడంలో సహాయపడటానికి ఉపయోగించే ఈకల డిస్క్. గుడ్లగూబ యొక్క రెక్కలు గుండా గాలిని నిశ్శబ్దంగా వెళ్ళేలా చేస్తుంది. ఇది గుడ్లగూబ ఉన్న ప్రదేశానికి ఎరను పట్టుకోకుండా నిరోధించడంలో సహాయపడుతుంది, గుడ్లగూబలు తమ స్వంత రెక్కల శబ్దం పైన తమ ఎరను వినడానికి అనుమతిస్తుంది.

గుడ్లగూబ మెడలోని అదనపు ఎముకల కారణంగా (14 సకశేరుకాల కోసం సాధారణ ఏడు), గుడ్లగూబ తన తలను పక్క నుండి ప్రక్కకు 270 డిగ్రీలు, 90 డిగ్రీలు పైకి క్రిందికి తిప్పగలదు.

గుడ్లగూబ ఎక్కువగా వోల్స్, ఎలుకలు, ష్రూలు, ఉడుతలు, పాకెట్ గోఫర్‌లతో సహా చిన్న పక్షులు, కప్పలను తింటుంది.

గొప్ప బూడిద గుడ్లగూబలు గూడు కోసం దట్టమైన అటవీ ప్రాంతాలు, వేట కోసం బహిరంగ ప్రదేశాల మిశ్రమంతో దేశీయ ప్రదేశాలలో కనిపిస్తాయి. తొంభై-ఆరు శాతం గూళ్లు 17.8-మీ వ్యాసార్థంలో రెండు లేదా అంతకంటే ఎక్కువ కోనిఫెర్ పందిరిని కలిగి ఉన్నాయి. కెనడాలోని ఉత్తర ప్రాంతాలలో, గుడ్లగూబలు పెద్ద శంఖాకార అడవులలో బోగ్‌లు, క్లియరింగ్‌లు మరియు బర్న్ జోన్‌ల చుట్టూ కనిపిస్తాయి. పశ్చిమ కెనడాలో, వారు పర్వత అడవులలోని పచ్చిక బయళ్లలో ఎక్కువగా వేలాడుతూ ఉంటాయి. గొప్ప బూడిద గుడ్లగూబలు 10, 20 సంవత్సరాల మధ్య జీవిస్తాయి.

స్కేల్-నిర్దిష్ట ఆకస్మిక పరిస్థితులు నివాస అనుకూలతను నిర్ణయించడంలో పాల్గొంటాయి, పునరుద్ధరణ అడవులను అంచనా వేయడానికి నిర్వహణ ప్రయోగాలలో కూడా ఈ జాతులు ఉపయోగపడతాయి. కలప కోత, అభివృద్ధి వల్ల నివాస నష్టం, విచ్ఛిన్నం ఈ గుడ్లగూబలకు అతిపెద్ద ముప్పు. అగ్ని, ప్రత్యక్ష మానవ ప్రభావాలు (కార్ స్ట్రైక్‌లు, వేటతో సహా), ఇతర పక్షుల నుండి వేటాడబడి, శీతాకాలంలో ఆకలితో, వెస్ట్ నైల్ వైరస్ వంటి వ్యాధులు సోకి చనిపోతాయి.

- సచిన్ కోత్వాల్
బాలచెలిమి డెస్క్, m : 8686664949

# చెమ్మ చెక్క - చారడేసి మొగ్గ



చెమ్మ చెక్క - చారడేసి మొగ్గ
అట్లు పోయంగ - ఆరగించంగ

ముత్యాల చెమ్మ చెక్క - ముగ్గులేయంగ
రత్నాల చెమ్మ చెక్క - రంగులేయంగా

పగడాల చెమ్మ చెక్క - పందిరేయంగ
పందిట్లో మా బావ - పెళ్లి చేయంగ

# గంధం మెడకు పూసుకొని



గంధం మెడకు పూసుకొని
పసుపు కుంకుమ రాసుకొని
కంటికి కాటుక పెట్టుకొని
ఆడవే ఆడవే అమ్మణ్ణి

కాళ్ళకు గజ్జలు కట్టుకొని
చేతికి గొలుసులు పెట్టుకొని
మెడకు దండలు వేసుకొని
ఆడవే ఆడవే అమ్మణ్ణి

పువ్వులు తలలో ముడుచుకొని
తిలకం నుదుట దిద్దుకొని
బుగ్గన చుక్క పెట్టుకొని
ఆడవే ఆడవే అమ్మణ్ణి





కథ

# ఆకలి విలువ




సుందరం మాస్టారు భోజనం చేయడానికి హోటల్‌కు వెళ్ళారు. అక్కడ సతీష్ అనే సప్లైర్ అన్నం వడ్డిస్తున్నాడు.

"రండి మాస్టారూ! చాలా రోజుల తరువాత మా హోటల్‌కు వచ్చారు" అని సతీష్ సాదరంగా ఆహ్వానించాడు.

"ఏం లేదు నాయనా! వాళ్ళ అమ్మకు నలతగా ఉందని తెలిసి పలకరించడానికి మా ఆవిడ ఊరెళ్ళింది. సాయంత్రానికి వస్తుందిలే. ఈ పూటకు తప్పని సరై భోజనానికి మీ హోటల్‌కు వచ్చాను" అన్నారు సుందరం మాస్టారు.

సతీష్ పెద్ద గిన్నె నిండా అన్నం, చిన్న గిన్నెలలో పలు రకాల కూరలు తీసుకుని వచ్చాడు.


"నాయనా సతీష్! ఒక అరిటాకు తీసుకునిరా" అని అడిగారు సుందరం మాస్టారు.

సతీష్ అరిటాకు తెచ్చి మాస్టారుకు ఇచ్చాడు. సుందరం దాన్ని బాగా కడిగి గరిటెతో అన్నం పెట్టుకున్నారు. తనకు కావలసిన కూరలు మాత్రమే చెంచాలతో వడ్డించుకుని తినసాగారు. ఆయన ప్రక్కనే ఉన్న టేబుల్‌పై కొందరు యువకులు భోజనం చేస్తున్నారు. వాళ్ళు ఇష్టానుసారంగా ఎంగిలి చేతులతో వడ్డించుకుని, తిన్నంత తిని, అన్ని కూరలు ఎంగిలి చేసి, ఇష్టం లేని కూరల్ని టేబుల్‌పై పడేస్తున్నారు. కానీ సుందరం మాస్టారు అలా చేయలేదు. తనకు కావలసినంత ఆహారాన్ని మాత్రమే తిని మిగిలిన ఆహారాన్ని పొట్లం కట్టమని సతీష్‌ను కోరారు.

"మాస్టారు! ఈ అన్నాన్ని రాత్రికి తింటారా?" ప్రశ్నించాడు సతీష్.

"లేదు నాయనా! మా ఆవిడ రాత్రికి ఊరి నుండి తిరిగి వచ్చేస్తుంది. హోటల్ బయట ఒక పేద వృద్ధురాలు ఎంతో నీరసంగా కనిపించింది. ఆకలితో ఉన్నట్లు నా మనసుకు అనిపించింది. ఈ ఆహారాన్ని ఆమెకు ఇస్తాను. ఆకలి విలువ నాకు తెలుసు. దాన్ని వృథా చేయకూడదు" అన్నారు మాస్టారు.

ఈ మాటలు విన్న ప్రక్క టేబుల్‌పై భోజనం చేస్తున్న యువకులు సిగ్గుతో తలదించుకున్నారు.




వారంతా మాస్టారు వద్దకు వచ్చి "క్షమించండి మాస్టారు! మేము చాలా ఆహారాన్ని వృథా చేశాము. ఇకపై మీరు చూపించిన బాటలోనే నడుస్తాము. ఇంట్లో ఆహారం మిగిలినా సరే దాన్ని ఎంగిలి చేయకుండా ఆకలిగొన్న పేదలకు పంచిపెడతాము" అని వాగ్దానం చేశారు.

యువకులలో వచ్చిన మార్పుకు సుందరం మాస్టారు హర్షం వ్యక్తం చేసి, వారికి ఆశీస్సులను అందించి పేద వృద్ధురాలికి ఆహారం ఇవ్వడానికి బయలుదేరారు.


– షేక్ అబ్దుల్ హకీం జాని
తెనాలి
m : 99494 29827


## సాహిత్య అకాడెమీ బాల సాహిత్య పురస్కారం 2025

సాహిత్య అకాడెమీ 2010 నుంచి తాను గుర్తించిన 24 భారతీయ భాషల్లో బాల సాహిత్య పురస్కారాన్ని అందిస్తోంది. అస్సామీ, బెంగాలీ, బోడో, డోగ్రీ, ఇంగ్లీష్, గుజరాతీ, హిందీ, కన్నడ, కాశ్మీరీ, కొంకణీ, మైథిలీ, మలయాళం, మణిపురీ, మరాఠీ, నేపాలీ, ఒడియా, పంజాబీ, రాజస్థానీ, సంస్కృతం, సంతాలీ, సింధీ, తమిళం, తెలుగు, ఉర్దూ భాషల్లో భారతీయ రచయితల ఉత్తమ బాలల రచనలకు ఏటా బాల సాహిత్య పురస్కారం ఇస్తారు. ఈ అవార్డు కింద ప్రతి అవార్డు గ్రహీతకు రూ.50,000 నగదు బహుమతి, రాగి ఫలకం, ప్రశంసాపత్రం అందజేస్తారు. సాహిత్య అకాడెమీ 2025 సంవత్సరానికి గాను భారతీయ రచయితలు, వారి శ్రేయోభిలాషులు, ప్రచురణకర్తల నుండి గుర్తింపు పొందిన మొత్తం 24 భారతీయ భాషల పుస్తకాలను బాల సాహిత్య పురస్కారానికి ఆహ్వానిస్తోంది. 9 నుంచి 16 ఏళ్ల మధ్య వయసున్న పాఠకులను లక్ష్యంగా చేసుకుని 2019, 2020, 2021, 2022, 2023 సంవత్సరాల్లో (అంటే 2019 జనవరి 1 నుంచి 2023 డిసెంబర్ 31 మధ్య) తొలిసారి ప్రచురించిన పుస్తకాలను పరిగణనలోకి తీసుకుంటారు. ఒక్కో పుస్తకం 2 కాపీలతో దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ 16 సెప్టెంబర్ 2024. ఈ అవార్డుకు సంబంధించిన వివరాలకు మా వెబ్‌సైట్ www.sahitya-akademi.gov.in లో అందుబాటులో ఉన్న బాల సాహిత్య పురస్కార నిబంధనలు చూడండి.


– కె. శ్రీనివాసరావు
సెక్రటరీ, సాహిత్య అకాడెమి

# అంతర్జాతీయ సంస్థలు, ప్రధాన కార్యాలయాలు

ప్ర : ఐక్యరాజ్య సమితి (UN) ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?

**జ : న్యూయార్క్ నగరం, యునైటెడ్ స్టేట్స్**

ప్ర : అంతర్జాతీయ ద్రవ్య నిధి (IMF) ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?

**జ : వాషింగ్టన్, యునైటెడ్ స్టేట్స్**

ప్ర : ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?

**జ : జెనీవా, స్విట్జర్లాండ్**

ప్ర : యూరోపియన్ యూనియన్ (EU) ప్రధాన కార్యాలయం ఏ నగరంలో ఉంది?

**జ : బ్రస్సెల్స్, బెల్జియం**

ప్ర : నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ (NATO) ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?

**జ : బ్రస్సెల్స్, బెల్జియం**



ప్ర : ఆర్గనైజేషన్ ఆఫ్ అమెరికన్ స్టేట్స్ (OAS) ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?

**జ : వాషింగ్టన్ డిసి, యునైటెడ్ స్టేట్స్**

ప్ర : ఆఫ్రికన్ యూనియన్ (AU) ప్రధాన కార్యాలయం ఏ నగరంలో ఉంది?

**జ : అడిస్ అబాబా, ఇథియోపియా**

ప్ర : ఇండోనేషియాలోని జకార్తాలో ఏ సంస్థ ప్రధాన కార్యాలయం ఉంది?

**జ : ఆగ్నేయాసియా దేశాల సంఘం (ఆసియాన్)**

ప్ర : ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ (IAEA) ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?

**జ : వియన్నా, ఆస్ట్రియా**

ప్ర : ఆర్గనైజేషన్ ఆఫ్ పెట్రోలియం ఎక్స్‌పోర్టింగ్ కంట్రీస్ (OPEC) ప్రధాన కార్యాలయం ఏ నగరంలో ఉంది?

**జ : వియన్నా, ఆస్ట్రియా**

ప్ర : అంతర్జాతీయ రెడ్‌క్రాస్ మరియు రెడ్ క్రెసెంట్ మూవ్‌మెంట్ (IRRCM) ప్రధాన కార్యాలయం ఏ నగరంలో ఉంది?

**జ : జెనీవా, స్విట్జర్లాండ్**

ప్ర : ప్రపంచ బ్యాంకు (World Bank) ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?

**జ : వాషింగ్టన్ డిసి, యునైటెడ్ స్టేట్స్**

ప్ర : అంతర్జాతీయ కార్మిక సంస్థ (ILO) ప్రధాన కార్యాలయం ఏ నగరంలో ఉంది?

**జ : జెనీవా, స్విట్జర్లాండ్**

ప్ర : యునైటెడ్ నేషన్స్ ఎడ్యుకేషనల్, సైంటిఫిక్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్ (UNESCO) ప్రధాన కార్యాలయం ఏ నగరంలో ఉంది?

**జ : పారిస్, ఫ్రాన్స్**

ప్ర : ప్రపంచ వాణిజ్య సంస్థ (WTO) ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?

**జ : జెనీవా, స్విట్జర్లాండ్**

**– సచిన్ కోత్వాల్**

## అవ్వా తాతలకు ఉత్తరం రాద్దాం రండి...



**కరీంనగర్:** అల్గునూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆ పాఠశాల ఆంగ్లోపాధ్యాయులు, కార్యశాల కన్వీనర్ & రిసోర్స్ పర్సన్ కాసు మహేందర్ రాజు సోమవారం 12.08.2024 ఉదయం లేఖారచనకు సంబంధించిన పలు అంశాలలో మెళకువలు తెలుపుతూ శిక్షణ నిచ్చారు. అవ్వా తాతలకు ఉత్తరం రాద్దాం రండి... కార్యక్రమంలో 25 మంది విద్యార్థులు వారి వారి అమ్మమ్మలు, నానమ్మలు, తాతయ్యలకు ఉత్తరాలు రాసారు. ఉత్తరాలను మ్యాజిక్ చాప్లిన్ చొక్కాపు వెంకటరమణ పేరిట ముద్రించిన ప్రత్యేక కవర్‌లో ఉంచి అవ్వా తాతల చిరునామాలకు పోస్టు చేయనున్నట్లు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రశంసా పత్రాలతో పాటు చక్కని పుస్తకాలను బహుమతులుగా అందజేయనున్నట్లు తెలిపారు. ఉత్తమ లేఖారచన చేసిన ఇద్దరు విద్యార్థుల లేఖలను రాష్ట్ర స్థాయి ఎంపికకు పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎ. పరశురాములు, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, రజిత, నిర్మల, సీమ, అంజమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

## "అంతా రామమయం" పుస్తకావిష్కరణ

**కరీంనగర్:** వీణవంక మండలం మామిడాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపనను స్ఫూర్తిగా తీసుకొని "అంతా రామమయం" బడిపిల్లల రచనలు పేరిట పుస్తకాన్ని తీసుకు రావడం హర్షించదగిన విషయమని ప్రముఖ కవి రచయిత డా. వైరాగ్యం ప్రభాకర్ అన్నారు. జూలై 7న స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు సుద్దాల శోభారాణి అధ్యక్షతన జరిగిన పుస్తకావిష్కరణ లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాసు మహేందర్ రాజు మాట్లాడుతూ మారుమూల గ్రామీణ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు విలక్షణమైన



రచనలు చేయడం అభినందనీయమన్నారు. సంపాదకురాలు అడువాల సుజాత చిన్నారులను ప్రోత్సహించిన ప్రధానోపాధ్యాయురాలు శోభారాణిల కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో హాస్య నటులు ఆర్ ఎస్ నందా, సమాజ సేవకులు రామోజు చంద్రమౌళి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తానా – మంచి పుస్తకం ఆధ్వర్యంలో బాలల నవలలకు ఆహ్వానం – 2025

**ఉత్తర అమెరికా:** ఉత్తర అమెరికా తెలుగు సంఘం (TANA) తెలుగు భాష సంరక్షణ, పరివ్యాప్తి కోసం వివిధ సాహిత్య కార్యక్రమాలు చేపడుతోంది. అందులో భాగంగా మంచి పుస్తకం (హైదరాబాద్) సంస్థతో పిల్లల పుస్తకాలను ప్రోత్సహించడం కోసం పదేళ్ళ పైబడిన బాలల కోసం నవలలను ఆహ్వానిస్తోంది. ఎంపికైన ఐదు నవలలకు ఒక్కొక్క దానికి పదిహేను వేల రూపాయల చొప్పున పారితోషికం.

1. **2024 నవంబరు 30 లోపు అందేలా రచనలు పంపాలి.** రచన అచ్చులో 1/8 డెమ్మీ సైజ్‌లో, 80 పేజీల లోపు (కనీసం 10 వేల పదాలు) ఉండాలి. రచన పిల్లలను ఆకట్టుకుని, వారితో చదివించేదిగా ఉండాలి. 2. పిల్లల్లో పఠనాసక్తిని పెంపొందించడం కోసం ఆహ్వానిస్తున్న నవలలు కాబట్టి భాష సరళంగా, చదివించేదిగా ఉండాలి. ప్రబోధాత్మకంగా ఉండకూడదు. 3. పిల్లల ఊహాశక్తిని, సృజనాత్మకతను పెంపొందించేవిగా రచనలు ఉండాలి. వివరాలకు

**పి. భాగ్యలక్ష్మి 94907 46614, వాసిరెడ్డి నవీన్ 98493 10560**

**Email: tana.mp.balalanavalalu2025@gmail.com**

## పురిమళ్ల ఫౌండేషన్ ఖమ్మం–మినీ నవలల పోటీ–2024

**ఖమ్మం:** ఏదైనా సామాజిక, పర్యావరణ పరిరక్షణ శాస్త్రీయ, మానవీయ సంబంధాలు – 30 పేజీలకు తగ్గకుండా రాసే నవలలకే ప్రాధాన్యత. పాఠశాల స్థాయి నుండి కళాశాల స్థాయి విద్యార్థులు పాల్గొనవచ్చు. నవలలు పంపుటకు ఆఖరి తేది : సెప్టెంబర్ 30, 2024. నవలలు పంపవలసిన చిరునామా : ఇ.నెం. 11-10-694/5, బురహాన్పురం, ఖమ్మం – 507001. సెల్ : 9494773969

## సామాజిక స్పృహ వున్నదే సిసలైన సాహిత్యం

**– మధురాంతకం నరేంద్ర**

**తిరుపతి :** 17.8.2024 శనివారం ఉదయం తిరుపతిలో గంటా మోహన్ అధ్యక్షతన, సాహితీ పురస్కారాల ప్రదానం జరిగింది. శివేవారి దేవమ్మ స్మారక కథాపురస్కారం శ్రీ మునిసురేష్ పిళ్ళె, బాలల కథా పురస్కారం R.C. కృష్ణస్వామిరాజు మరియు కూచిమంచి సాగేంద్ర గార్లకు అందజేసి సత్కరించారు. కె.వి. మేఘనాధరెడ్డి రచించిన "పాయి



దరువులు" నవలను అతిథులు ఆవిష్కరించారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత మధురాంతకం నరేంద్ర మాట్లాడుతూ సామాజిక స్పృహ కల్గి వున్నదే అసలు సిసలైన సాహిత్యమని అన్నారు. నేటి తరానికి పుస్తక పఠనంపట్ల ఆసక్తి పెంపొందించాల్సి వుందని పేర్కొన్నారు. విశిష్ట అతిథి ఆచార్య ఆశాజ్యోతి మాట్లాడుతూ యువ రచయితలు తమ రచనల్లో సామాజిక వాస్తవికతను, సమకాలీన సమస్యలను చక్కగా ప్రతిబింబిస్తున్నారని ప్రశంసించారు. గౌరవ అతిథి పలమనేరు బాలాజీ మాట్లాడుతూ పాయిదరువులు నవల గ్రామీణ నేపథ్యంలో, గిరిజన జీవితాలకు, అడవితో పెనవేసుకున్న వారి కష్ట సుఖాలకు దర్పణం పట్టిందన్నారు. చిత్తూరు మాండలకంలో ఈ నవల అందరినీ ఆకట్టుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో సాహితీ వేత్తలు సి.ఎన్.. చంద్ర శేఖర్ 'పల్లిపట్టు నాగరాజు, సాకం నాగరాజు, జిల్లేళ్ళ బాలాజీ, మౌని, కొత్వాల్ అమరేంద్ర, గరికపాటి రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## "భారత వనం" పుస్తకావిష్కరణ

**సూర్యాపేట:** కోదాడ ఇటీవల ప్రముఖ బాలసాహితీవేత్త, తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కార గ్రహీత శ్రీ పుప్పాల కృష్ణమూర్తి గారు రచించిన "భారత వనం" అనే పిల్లల కథల పుస్తక ఆవిష్కరణ జరిగింది. ఇది వీరి 18వ బాలల కథల పుస్తకం. సభాధ్యక్షులుగా రావెళ్ల సీతారామయ్య పుస్తకావిష్కర్తగా పెద్దిరెడ్డి గణేష్ కవి, ముఖ్య అతిథిగా అనంతోజు మోహన్ కృష్ణ పాల్గొన్నారు. ఈ పుస్తకాన్ని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్- ప్రశాంతి దంపతులకు అంకితం ఇవ్వడం జరిగింది. శిరంశెట్టి కాంతారావు ప్రముఖ కథా రచయిత భారత వనం అనే పుస్తకాన్ని సమీక్ష చేశారు. వీరు మాట్లాడుతూ "తెలంగాణ కథ బండారు అచ్చమాంబతో మొదలై ఇప్పటి పుప్పాల కృష్ణమూర్తి వరకు కొనసాగుతూనే ఉంది" అని చెప్పారు.



బంగారు నాగమణి మాట్లాడుతూ "పిల్లల్లో పఠనా శక్తి తగ్గిపోయి సెల్ ఫోను, టీవీ మోజులో పడిపోయారు. పిల్లలు కథలు చదివితే పిల్లల్లో పఠనాశక్తితో పాటు, సృజనాత్మకత కూడా పెరుగుతుందని" చెప్పారు. పుస్తకాన్ని అంకితం తీసుకున్న బెల్లంకొండ రాజశేఖర్ మాట్లాడుతూ కృష్ణమూర్తిది పసిపిల్లల మనస్తత్వం. ఇప్పటికీ ఎప్పటికి మారని వ్యక్తిత్వం తనది. అందుకనే పిల్లల కథలను ఇంత బాగా రాయగలుగుతున్నారు. ఈ పుస్తకాన్ని అంకితంగా తీసుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నాను" అని చెప్పారు. పెన్షనర్ ఉద్యోగస్తుల కోదాడ రచయితల సంఘం సభ్యులు బంగారు రామాచారి, యువ బాల సాహితీవేత్త ముక్కామల జానకిరామ్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## "బడిపిల్లల కథల పోటీ 2024"

**హైదరాబాద్:** ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు చదివే బడి పిల్లల కోసం మాచిరాజు సీతారామయ్య, రత్నకుమారి దంపతుల స్మారక కథల పోటీని మాచిరాజు బాలసాహిత్య పీఠం నిర్వహిస్తున్నట్లు మాచిరాజు కామేశ్వరరావు ప్రకటించారు. వివరాలకు సంప్రదించవలసిన నంబర్లు 9000080396, 9849649101 కథలు చేరవలసిన ఆఖరు తేదీ 30 సెప్టెంబర్ 2024.

## యువతరం సాహిత్య సృజన కార్యశాల


**నిజామాబాద్:** ఎమర్జింగ్ రైటర్స్ తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల నిజామాబాద్‌లో 23.08.2024 న కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ధాత్రిక వెంకటేశ్వరరావు గారి అధ్యక్షతన యువతరం సాహిత్య సృజన కార్యశాల నిర్వహించారు. ముఖ్య అతిథి డాక్టర్ వి. రాజేశ్వర శర్మ గారు కథా రచన గురించి బాల సాహితీవేత్త గరిపల్లి అశోక్ గారు కథ నిర్మాణం ఎలా ఉండాలి, ప్రారంభం, ఎత్తుగడ, ముగింపు, కథ శైలి, భాష, ఎలా ఉండాలో విద్యార్థులకు క్షుణ్ణంగా తెలియజేశారు. ఈ కార్యాశాలలో వివిధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.సరిత, ఎమర్జింగ్ రైటర్స్ కోఆర్డినేటర్ డాక్టర్ సంధ్యా దీప్తి, పాల్గొన్నారు.



వ్యక్తిత్వం

# మరో మహాత్ముడు - ఆంధ్రా గాంధి - శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య గారు

శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య గారు 17-09-1906 న గుంటూరు జిల్లాలోని సత్తెనపల్లిలో జన్మించారు. వీరి తల్లి తండ్రులు శ్రీమతి పేరిందేవి, శ్రీ నరసింహం గార్లు. వీరు నాలుగవ సంతానం. చదువుకునే రోజుల్లోనే గాంధీజీ స్వాతంత్ర్య ఉద్యమం వైపు ఆకర్షితులై, విద్యను మధ్యలోనే ఆపి వేసి అనేక ఉద్యమాలలో పాల్గొని బ్రిటిష్ వారిచే జైలు శిక్షలు కూడా అనుభవించారు.



రెండు జతల ఖద్దరు బట్టలు, గాంధీజీ బొమ్మ వున్న ఒక ఖద్దరు సంచిలో సర్దుకొని నిత్యమూ ఏదో ఒక ప్రజా ఉద్యమంలో పాల్గొనటానికి సిద్ధంగా ఉండే ఈ అసాధారణ వ్యక్తి మన ఆంధ్రుడే అని గర్వంతో చెప్పుకోవచ్చు. ఏక సంథాగ్రాహి, తెలుగు ఆంగ్ల భాషలలో అనేక గ్రంధాలు రచించారు. పెద్ద విద్యాధికుడు కాదు, సామాన్యమైన మాధ్యమిక విద్యాలయంలో చదువుకున్న విద్యే! అయితేనేమి, అమోఘమైన ధారణ కలిగిన వ్యక్తి. ఎంతో మంది మేధావులు, విద్యావంతులు విశ్వ విద్యాలయాలలో వీరి 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వపు బడ్జెట్ ఉపన్యాసాలు' వినటానికి కుతూహల పడేవారు ఆరోజుల్లో! ప్రజా ఉద్యమాలు వారికి ఊపిరి, ఉత్తేజం!. గురజాడ వారి కన్యాశుల్కం గురించి ఎంత విశ్లేషణా పూర్వకంగా విపులీకరించి చెప్పేవారో!

1925 లోనే సత్తెనపల్లిలో 'శారదా నిలయం' అనే గ్రంథాలయం నెలకొల్పటమే కాకుండా, గ్రంథాలయ ఉద్యమాలు చేసి, అనేక గ్రంధాలయాల ఏర్పాటుకు కృషి చేసారు. 1952లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రానికి శాసన సభ్యునిగా సత్తెనపల్లి నుండి ఉభయ కమ్యూనిస్ట్ పార్టీల మద్దతుతో అభ్యర్ధిగా పోటీచేసి ఎన్నికయ్యారు. ఆ తరువాత వీరు చాలాసార్లు Independent అభ్యర్ధిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జీవితాంతం గాంధేయ వాదిగా కొనసాగిన వీరు శ్రీ ప్రకాశం పంతులు గారికి సన్నిహితులు.

వావిలాల గోపాలకృష్ణయ్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ అండ్ హయర్ స్టడీస్ అనే సంస్థని గుంటూరు అరండల్‌పేటలో ఏర్పాటు చేసారు. దానినే 'వావిలాల సంస్థ' గా పిలుస్తుంటారు. అందులో గోపాల కృష్ణయ్య గారు సేకరించిన వేలాది పుస్తకాలతో ఒక గ్రంధాలయం కూడా ఉన్నది.

చివరి రోజులలో శ్వాస కోశ సంబంధమైన వ్యాధితో నిమ్స్‌లో కొంతకాలం వైద్యం చేయించుకొన్న వీరు అతను 2003 ఏప్రిల్ 29న ఆఖరి శ్వాస వదిలాడు.

జీవితమంతా నిరాడంబరంగా గడిపారు. ఆజన్మ బ్రహ్మచారి. అజాత శత్రువు శ్రీ వావిలాల గోపాల కృష్ణయ్య గారు.

– బాలచెలిమి డెస్క్

# Oxford Grammar High School

OGS JUNIORS
grow naturally

43rd YEARS OF MERITORIOUS PERFORMANCE





## We make school time the best time for your kids

At OGS Juniors, all the children are given a warm, safe, and stimulating environment so that they can grow to become individuals while exploring, imagining, creating, and playing.

- Loving atmosphere & play ground
- CCTV surveillance
- Certified teachers & caring staff
- Kids zone & play area
- Interactive & Value based Learning

### CARING TEACHERS & STAFF
Your child will get the best care and attention

### ECO-FRIENDLY PRACTICES
We let the children play with nature friendly material

### HUGE PLAYGROUND
Your child will get lots of fresh air and playtime

### INTERACTIVE LEARNING
Our trusted method helps your child communicate and learn with ease.

**Street No. 13, Himayathnagar, Hyderabad | Ph : 040 2763 6214, 99590 20512**

RNI Regn. No. 52828/92 TC No. TEL Tel01232

# చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ
హైదరాబాద్ (Regd. 720/1982)

బాల చెలిమి
పిల్లల వికాస పత్రిక

## తెలంగాణ బడి పిల్లల కథలు



**10 పుస్తకాల సెట్ ధర రూ.330 • తగ్గింపు ధర రూ. 300**

పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు - ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం, పిల్లలో నైతికతను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాలసాహిత్యమే నెరవేర్చగలదు.

ఇవి అచ్చంగా మన పిల్లలు రాసిన కథలు, స్వచ్ఛమైన కథలు. 'చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ' తెలంగాణలోని ఉమ్మడి 10 జిల్లాల **"బడి పిల్లల కథలు"** సంకలనాలుగా అందమైన బొమ్మలతో గతంలో వెలువరించింది. అవి రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ విశేష ఆదరణ పొందాయి.

అలాగే ఇప్పుడు పిల్లలకోసం తెలంగాణలోని ఉమ్మడి పది జిల్లాల బాల సాహిత్య రచయితలు రాసిన **"పెద్దలు రాసిన పిల్లల కథలు"** పది సంకలనాలను అందమైన బొమ్మలతో వెలువరించింది. చిన్నారులు, పెద్దలు, సాహితీ వేత్తలు ఎప్పటివలె ఈ పుస్తకాలను ఆదరిస్తారని ఆశిస్తున్నాం.

-మణికొండ వేదకుమార్
చైర్మన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ

## పెద్దలు రాసిన పిల్లల కథలు (ఉమ్మడి పది జిల్లాలు)



**10 పుస్తకాల సెట్ ధర రూ.350 • తగ్గింపు ధర రూ. 300**



**ప్రతులకు**

అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు. మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం.12,
హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88
*email: edit.chelimi@gmail.com* *website : www.balachelimi.com*




## చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు




Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, H.No.1-9-1126/B, Azamabad, Musheerabad, Hyderabad-500020, Telangana State.
Published at "CHANDRAM", # 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana.
Editor: Manikonda Vedakumar. RNI Reg No. 52828/92, Tc No: TEL Tel01232.
Cell : 9030626288, Mail ID : edit.chelimi@gmail.com